శనివారం
30-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 188
పేజీలు : 8, వెల:రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

న్యూఇయర్ వేడుకలపై పాక్ నిషేధం

ఇస్లామాబాద్: పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా న్యూ ఇయర్ వేడుకలకు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నిర్ణయించింది. ఈ మేరకు ఆపద్ధర్మ ప్రధాని అన్వరుల్ హక్ కాకర్ గురువారం ప్రకటించారు. నూతన సంవత్సర వేడుకలను నిషేధించినట్లు వెల్లడించారు. ఇజ్రాయిల్ భీకర పోరులో 9వేల మంది చిన్నారులు సహా 21వేల మంది పలస్తీనియన్లు మరణించడం కలచివేస్తోందన్నారు. రక్తపాతాన్ని ఆపాలని అనేక అంతర్జాతీయ ఫోరాల్లో గళం వినిపిస్తున్నట్లు చెప్పారు. పలస్తీనాకు సాయం, గాయపడిన వారి తరలింపుపై ఈజిప్టుతో చర్చలు జరుపుతున్నట్లు కాకర్ తెలిపారు.

పేద పిల్లలకు వరం
విద్యా దీవెన

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

8.09 లక్షల మందికి రూ.584 కోట్లు జమ

విశాలాంధ్ర-భీమవరం: రాష్ట్రంలో పిల్లలు గొప్పగా చదవాలని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో జులై-సెప్టెంబరు త్రైమాసానికి సంబంధించి అర్హులైన 8,09,039 మంది విద్యార్థులకు రూ.584 కోట్ల నిధులను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ మీట నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. నేడు 8.09 లక్షల మంది విద్యార్థులకు అక్షరాలా రూ.584 కోట్లు నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. కాగా, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇబ్బందులు కలుగకూడదన్న ఉద్దేశంతో దాదాపు 2 లక్షల మంది విద్యార్థులకు చివరి చెల్లింపు కూడా జమ చేశామన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఈ ఒక్క పథకం కింద 27.61 లక్షల మంది పిల్లలకు పూర్తి ఫీజు అక్షరాలా రూ.11,900 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. జగనన్న వసతి దీవెన పథకం కింద ఈ నాలుగున్నరేళ్లలో పిల్లల

- మిగతా 2 లో

అసంతృప్తి జ్వాల

- వైసీపీలో ఇన్‌ఛార్జ్‌ల మార్పుపై కసరత్తు వేగవంతం
- త్వరలోనే తుది జాబితా ప్రకటనకు సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీల స్థానాల మార్పులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలపై నేతల్లో నెలకొంటున్న అసంతృప్తి రోజురోజుకూ రాజుకుంటోంది. ఇప్పటివరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి ఇప్పుడిప్పుడే పెల్లుబుకుతోంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌ల మార్పుపై సీఎం జగన్ కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న కసరత్తు కొలిక్కి వస్తోంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జ్‌లను ఖరారు చేసిన సీఎం, మిగిలిన నియోజకవర్గాలకు త్వరలోనే ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించేందుకు జాబితాను సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలను తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడుతున్నారు. దీంతో సీఎం క్యాంపు కార్యాలయం కోలాహలంగా ఉంటోంది. ముఖ్యమంత్రిని కలిసే ముందుగా నేతలు ప్రభుత్వ రాజకీయ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ అవుతున్నారు. వచ్చే ఎన్నికలకు మరలా టికెట్ ఖరారు చేసే వారిని నేరుగా సీఎం దగ్గరకు పంపుతుండగా, సీట్లు మార్చేవారిని, టికెట్ ఇచ్చే అవకాశం లేని వారిని మాత్రం తొలుత సజ్జల మాట్లాడి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసిన తర్వాత మాత్రమే సీఎం దగ్గరకు పంపుతున్నారు. శుక్రవారం సీఎం జగన్ భీమవరం పర్యటనకు వెళ్లారు. అయినప్పటికీ క్యాంపు కార్యాలయానికి తాకిడి ఎక్కువగానే కనపడింది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు... సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చి తన సీటు విషయమై పార్టీ ముఖ్య నేతలను కలిసి మంతనాలు జరిపారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి లక్ష్మారెడ్డి సీఎం కార్యాలయానికి వచ్చారు. రేపల్లె ఇన్‌ఛార్జి మార్పుతో అసంతృప్తిగా ఉన్న ఎంపీ మోపిదేవి వెంకటరమణను సీఎం జగన్ పిలిపించారు.

ఎన్నికల్లో పోటీ చేసే స్థానం విషయంలో సీఎం చర్చించినట్లు తెలిసింది. విజయవాడ తూర్పు నియోజకవర్గ నేత దేవినేని అవినాష్ సీఎంవోకి వచ్చి వెళ్లారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మరోసారి సీఎంవోకు వచ్చి గిద్దలూరు సహా ప్రకాశం జిల్లాలో వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల మార్పుపై సీఎంతో చర్చించినట్లు తెలిసింది. రెండ్రోజులుగా క్యాంపు కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్పుపై సీఎంతో చర్చించారు. మరోసారి సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రాయదుర్గం అసెంబ్లీ, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాల వైసీపీ ఇన్‌ఛార్జి మార్పుపై సీఎంతో చర్చించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాల మార్పులపై చర్చించిన సీఎం ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతల అభిప్రాయాలు తెలుసుకుని ఇన్‌ఛార్జ్‌లను ఖరారు చేస్తున్నారు. మరలా గెలిచే అవకాశం లేని వారిని కొందరిని ఎంపీలుగా నిలబెట్టేందుకు ఒప్పిస్తున్నారు. అలాగే ప్రస్తుతం ఎంపీలుగా ఉన్న వారిని ఈసారి అసెంబ్లీకి పోటీ చేయాల్సిందిగా సూచిస్తున్నారు. ఈ మార్పులు, చేర్పులపై ఎంపీలు, ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. స్వంత నియోజకవర్గాన్ని వదిలిపెట్టి పక్క నియోజకవర్గానికి వెళ్లడమంటే ఓడిపోయినట్టేనని, దానిని అవమానంగా వారు భావిస్తున్నారు. అసలు సీఎం జగన్‌పై వ్యతిరేకత ప్రజల్లో తీవ్రంగా ఉందని, ఆ ప్రభావం తమపై పడుతుందని మేం భయపడుతుంటే, తమను కించపరిచే విధంగా పార్టీ అధిష్ఠానం నిర్ణయాలు తీసుకుంటుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లోకేశ్‌కు సీఐడీ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు శుక్రవారం సీఐడీ నోటీసులు జారీ చేసింది. యువగళం పేరుతో లోకేశ్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన అధికారుల పేర్లను లోకేశ్ రెడ్‌బుక్‌లో నోటు చేసుకుంటున్నట్లు ఆయా సభల్లో ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. దీనిపై సీఐడీ అధికారులు కొందరు రెడ్‌బుక్ పేరుతో నారా లోకేశ్ బెదిరిస్తున్నారని కోర్టును ఆశ్రయించారు. దీంతో నారా లోకేశ్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సూచించారు. ఈ నేపథ్యంలోనే సీఐడీ అధికారులు వాట్సాప్‌లో నోటీసులు పంపగా, లోకేశ్ కూడా వాటిని అందుకున్నట్లు వాట్సాప్ ద్వారానే తిరిగి సమాధానమిచ్చారు. ఈ కేసులో ఏసీబీ కోర్టు తదుపరి విచారణను జనవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

3 నుంచి మున్సిపల్ కార్మికుల
నిరవధిక సమ్మె

మంత్రి మాటలు విశ్వసించలేం: జేఏసీ నేతలు

విశాలాంధ్ర-విజయవాడ: జనవరి 3 నుండి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బరాయుడు, కో కన్వీనర్లు పరుచూరి దుర్గాప్రసాద్, వైవీ రమణ, శంకరరావు తెలిపారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన జేఏసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సమావేశం అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7న మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేస్తూ డిసెంబర్ 27 లోపల మున్సిపల్

- మిగతా 2 లో

కరోనా 'పరీక్ష'

చాప కింద నీరులా మహమ్మారి వ్యాప్తి

- ఏపీలో 61కి చేరిన కేసులు
- విజయవాడ, విశాఖలో అత్యధికం
- విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకం
- ఎన్నికల నిర్వహణకు ఆటంకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కరోనా అందరికీ పరీక్షగా మారనుంది. ప్రభుత్వ కార్యకలాపాలకు, విద్యార్థుల చదువులకు, ప్రజల ఆరోగ్యానికి పెద్ద అసౌకర్యం కానుంది. మూడు విడతల కరోనాలతో రాష్ట్ర ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బతగిలింది. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రజా జీవితం చిన్నాభిన్నమైంది. మళ్లీ కరోనా కేసులు నమోదుతో రాష్ట్ర ప్రజలు వణికిపోతున్నారు. కరోనా నుంచి గట్టెక్కామని అంతా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మళ్లీ దేశ వ్యాప్తంగా కేసుల నమోదు అందరిలో ఆందోళన కలిగిస్తోంది. తాజాగా రాష్ట్రంలో 61 కేసులు నమోదు కావడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. విజయవాడ, విశాఖపట్నంలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. మరో నాలుగు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. వాటిపైనే ప్రభుత్వంతో పాటు అన్ని రాజకీయ పార్టీలు ప్రధాన దృష్టి పెట్టాయి. దేశంలోని ఏ ఒక్క రాష్ట్రంలోనైనా కరోనా కేసులు ఉధృతమైతే, దాని ప్రభావంతో జాతీయ స్థాయి విద్యా రంగ పరీక్షలను వాయిదా వేసే అవకాశం ఉంది. కరోనా కేసుల నమోదు ప్రభావంతో ఆయా పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధ తగ్గిపోతుంది. కాగా, కరోనా కారణంగా ప్రజలంతా మళ్లీ మాస్క్ వేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కరోనా నివారణ చర్యలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఆస్పత్రుల సన్నద్ధత, కరోనా టెస్ట్‌లు, నియంత్రణకు అధికార యంత్రాంగం నిమగ్నమైంది. తొలుత తెలంగాణ రాష్ట్రంలో కరోనా కేసులు నమోదయ్యాయి. అనంతరం ఏపీలోనూ కరోనా కేసులు పెరిగాయి. రాష్ట్రం నుంచి శబరిమలైకు లక్షలాది మంది భక్తులు తరలివెళ్లారు. వారందరూ తిరిగి రాష్ట్రానికి వచ్చేటప్పుడు కరోనా టెస్టులు చేసి, పాజిటివ్ ఉన్న వారిని క్వారంటైన్‌లకు

- మిగతా 2 లో

వివేకా హత్యకేసులో కీలక పరిణామం

సీబీఐ ఎస్పీ సహా వివేకా కుమార్తె, అల్లుడిపై ఛార్జ్‌షీట్ దాఖలు

2లో

పస్తులుండాల్సిందేనా!

- బియ్యం ధర బేజారు
- పేద, మధ్యతరగతి ప్రజలు కొనుక్కోలేని దుస్థితి
- మరికొన్ని నెలలు ఇదే పరిస్థితి
- 26 కిలోలు రూ.2 వేలకు...

న్యూఢిల్లీ: దేశంలో బియ్యం ధరలు బేజారెత్తిస్తున్నాయి. పంట దిగుబడి గణనీయంగా తగ్గడం, ప్రకృతి వైపరీత్యాల ఫలితంగా సాగు విస్తీర్ణం అంతంతమాత్రంగానే ఉండటంతో బియ్యం ధరలు తాజాగా 15 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరాయి. దేశీయ లభ్యతను పెంచడానికి, ధరల పెరుగుదలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం ఫలించడం లేదు. పాలకులు ఆలస్యంగా మేల్కొనడంపై ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు, ఇంధనం, విద్యుత్ చార్జీలు వంటి భారాలతో ప్రజలు నిత్యం సతమతమవుతున్నారు. అయితే కొన్ని రోజుల నుంచి బియ్యం ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో ప్రజలు కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడింది.. బియ్యం రిటైల్ సగటు ధర డిసెంబరు 26న రూ.43.33 వద్ద నమోదయింది. ఇది సంవత్సరం క్రితం కంటే 14 శాతం పెరిగింది. ఇక మంగళవారం గోధుమ ధర రూ.31.02గా ఉంది. ఇది సంవత్సరం క్రితం కంటే 1 శాతం పెరిగింది. హోల్‌సేల్ మార్కెట్‌లో అఖిల భారత సగటు బియ్యం 15 శాతం పెరగగా, గోధుమలు ఏడాది క్రితంతో పోలిస్తే 1 శాతం తగ్గాయి. బియ్యం ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం కొన్ని చర్యలు పరిశీలిస్తున్నట్లు తెలిపింది. భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) కూడా ఈ సమస్యను ఆందోళన కలిగించేదిగా పేర్కొంది. బుధవారం జరిగిన వారాంతపు వేలంలో ధాన్యం నాసిరకంగా రావడంతో కేంద్రం ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) అందించే 1.93 లక్షల టన్నుల్లో 10 వేల టన్నుల బియ్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. 'వ్యాపారులు ప్రభుత్వం చెప్పింది వినకపోవడం, వేలంలో పాల్గొనాలన్న అభ్యర్థనను పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకూడదనుకున్నప్పటికీ, లభ్యతను పెంచడానికి అది బలవంతంగా చేయవలసి రావచ్చు' అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ధరల నియంత్రణలో భాగంగా కేంద్రం ఇప్పటికే భారత్ బ్రాండ్‌తో గోధుమ పిండి, పప్పులు విక్రయిస్తోంది. ప్రస్తుతం దేశంలో కిలో బియ్యం సగటు ధర రూ.43 ఉండగా, ఇప్పుడు 'భారత్' బ్రాండ్‌తో బియ్యాన్ని విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే, స్టాక్ పరిమితి, తగ్గింపు ధరలకు రిటైల్ విక్రయాలు ఉన్నాయి. 'భారత్ అట్టా' తరహాలో సహకార సంఘాల ద్వారా కొంత తగ్గింపు అమ్మకాలు ఉండవచ్చు. ఆసియా, ఆఫ్రికాలోని కోట్ల మంది ప్రజల ఆహారంలో బియ్యం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నేరాలు తగ్గిపోయాయని పెద్దసారు చెప్పారు కదా! ఎందుకు చెప్పండి నా వెంట పడతారు?

సీట్ల సర్దుబాటుపై కసరత్తు

- 'ఇండియా' భాగస్వాములతో కాంగ్రెస్ చర్చలు
- రాష్ట్రస్థాయి నేతలతో అధిష్ఠానం భేటీలు
- 4న మేనిఫెస్టో కమిటీ తొలి సమావేశం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ...రాజకీయ పార్టీలు వ్యూహాలు, ఎత్తుగడలతో ముందుకుసాగుతున్నాయి. భావసారూప్యత గల పార్టీలు సీట్ల సర్దుబాటుపై దృష్టి సారించాయి. ప్రత్యేకించి మోదీ సర్కారును గద్దె దించే లక్ష్యంతో ఏర్పడిన ప్రతిపక్ష ఇండియా కూటమి సీట్ల సర్దుబాటుకు సిద్ధమైంది. కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే ఎన్నికల సమరశంఖం పూరించింది. ఎన్నికలకు ఎక్కువ సమయం లేకపోవడంతో కార్యాచరణను రూపొందించుకుంటోంది. భారత్ న్యాయ యాత్రకు సన్నాహాలు ముమ్మరం చేసింది. అన్ని రాష్ట్రాలకు చెందిన విపక్ష పార్టీ నేతలతోనూ ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోంది. ఇదేక్రమంలో వచ్చే వారం నుంచి సీట్ల సర్దుబాటుపై చర్చలను లాంఛనంగా ప్రారంభించనుంది. ఇండియా కూటమిలోని పార్టీల నేతలతో సమాలోచనలు జరపనున్నట్లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తెలిపాయి. అలాగే సార్వత్రిక ఎన్నికల కోసం పార్టీ మేనిఫెస్టో కమిటీ జనవరి 4న తొలిసారి భేటీకానుంది. సమావేశానికి సీనియర్ నేత పి.చిదంబరం నాయకత్వం వహిస్తారు. కొన్ని రోజులుగా అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇన్‌చార్జీలతో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్

- మిగతా 2 లో

'డీఎన్‌యూ' రద్దు చేయాల్సిందే

కార్మిక -సామాజికోద్యమ సంఘాల డిమాండ్

అర్జెంటైనా ప్రభుత్వంపై పెల్లుబికిన నిరసన

బ్యూనోస్ ఎయిర్స్: అర్జెంటైనా అధ్యక్షుడు కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ప్రధాన కార్మిక - సామాజిక ఉద్యమ సమాఖ్యలు పిలుపునిచ్చాయి. ఇటీవల ఏడు వేల మంది కార్మికులపై వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండించాయి. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా తీసుకొచ్చిన డిక్రీ ఆఫ్ నెసెసిటీ అండ్ అర్జెన్సీ (డీఎన్‌యూ)ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. ఇదే క్రమంలో జనరల్ కాన్ఫడరేషన్ ఆఫ్ లేబర్ (సీజీటీ), వర్కర్స్, సెంట్రల్ యూనియన్ ఆఫ్ అర్జెంటైనా (సీటీఏ), ది అసోసియేషన్ ఆఫ్ స్టేట్ వర్కర్స్ (ఏటీఈ), ఫ్రెంటే పాట్రియా గ్రాండేతో పాటు వామపక్ష పార్టీలు, సామాజిక ఉద్యమ, కార్మిక సంఘాలు స్థానిక న్యాయస్థానాల ఎదుట ఆందోళన చేశాయి. లక్ష మందికిపైగా రోడ్లపైకొచ్చి నిరసన గళాన్ని వినిపించాయి. ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టాయి. బ్యానర్లు, ప్లకార్డులు, నినాదాల రూపేణ ప్రభుత్వంపై వ్యతిరేకతను ఆందోళనకారులు వ్యక్తపరిచారు. కార్మిక హక్కులను అణచివేసే విధంగా, ఆర్థిక వ్యవస్థను గాడి తప్పించేలా కొత్త ఉత్తర్వులున్నట్లు కార్మిక సంఘాలు దుయ్యబట్టాయి. అధ్యక్షుడి ఉత్తర్వులు రాజ్యాంగానికి విరుద్ధమని, డీఎన్‌యూను రద్దు చేయాలని కార్మిక, సామాజిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీని కోసం న్యాయస్థానాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. ఒక్క కార్మికుడిపై వేటును కూడా అంగీకరించేది లేదని ఏటీఈ రొడాల్ఫో అగ్యుర్ ప్రధాన కార్యదర్శి ఓ ప్రకటన చేశారు. ఇదే విధంగా కార్మికులను విధుల నుంచి తొలగిస్తూ పోతే ప్రత్యక్షంగా కార్మికులు, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుంది కానీ పరోక్షంగా మొత్తం కార్మిక వర్గాన్ని ఇది ప్రభావితం చేస్తుందని వెల్లడించారు. విధుల్లో నుంచి తొలగించడం అంటే హక్కులను కాలరాయడమేనని, ఇటువంటి కార్మిక వ్యతిరేక ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు.

మైనేలోనూ ట్రంప్‌పై అనర్హత వేటు

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికా అధ్యక్ష ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, డొనాల్డ్ ట్రంప్ పోటీ చేస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. క్యాపిటల్ భవనంపై దాడి కేసులో దోషిగా తేల్చుతూ కొలరాడో ఇప్పటికే ఆయనపై అనర్హత వేటు వేసింది. తాజాగా మైనే రాష్ట్రం కూడా ఆయన పోటీని తిరస్కరించింది. ప్రాథమిక ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా పేర్కొంది. ఈ మేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి షెనా బెల్లోస్ గురువారం నిర్ణయం తీసుకున్నారు. అయితే బెల్లోస్ నిర్ణయాన్ని మైనే కోర్టుల్లో సవాల్ చేస్తామని ట్రంప్ వర్గం ప్రకటించింది.

దీంతో కోర్టు తీర్పు వచ్చేంత వరకు తమ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు బెల్లోస్ వెల్లడించింది. కొలరాడో తర్వాత మైనే కూడా ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉండటంతో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు కీలకంగా మారింది. ట్రంప్ అధ్యక్ష రేసులో నిలుస్తారా లేదా అన్నది సుప్రీంకోర్టు తేల్చనున్నది. దీంతో తీర్పు ట్రంప్‌కు అనుకూలంగా వస్తుందా లేక వ్యతిరేకంగానా అనే చర్చ సర్వత్రా జోరుగా సాగుతోంది. ట్రంప్ వర్గీయులు మాత్రం న్యాయస్థానం తీర్పు అనుకూలంగా వస్తుందని, ట్రంప్ పోటీ చేయడమే కాకుండా అధ్యక్ష పీఠాన్ని అధీష్టిస్తారన్న దీమాను వ్యక్తంచేస్తున్నారు.

వెనిజులా సైనిక ఆపరేషన్ ఆరంభం: మదురో

కారకస్: వెనిజులాలో మిలటరీ ఆపరేషన్ మొదలైంది. తూర్పు వెనిజులాలో బొలీవియన్ నేషనల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (ఎఫ్ఏఎన్‌బీ)తో కలిసి సంయుక్త సైనిక చర్యలను ప్రారంభించాలని వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురో ఆదేశించారు. బ్రిటన్ నుంచి ముప్పు ఉన్నందునే ఈ మేరకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన గురువారం తెలిపారు. పొరుగునున్న గుయానా జలాల్లో బ్రిటిష్ సైనిక నౌకను నిలపడమంటే గుయనా ప్రభుత్వంతో వెనిజులా డిసెంబరు 14న చేసుకున్న ఒప్పందాన్ని నీరుగార్చడమేనని అన్నారు. దౌత్య ప్రయత్నాలు చాలని పక్షంలో తగు విధంగా స్పందిస్తామని తెలిపారు. అంతర్జాతీయ చట్టానికి లోబడి తమ కార్యాచరణ ఉంటుందని మదురో అన్నారు. బ్రిటన్ వైఖరి ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్న మదురో... బ్రిటన్‌పై ప్రతిస్పందన చర్యల్లో భాగంగా ఎఫ్ఏఎన్‌బీ సంయుక్త సైనిక చర్యలకు ఆదేశాలిచ్చారు. అదే సమయంలో ఆయన దేశ సైనికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు.

'యూఎస్‌ఎస్‌ఎఫ్-52' విజయవంతం: స్పేస్‌ఎక్స్

వాషింగ్టన్: ఫాల్కన్ భారీ వ్యోమనౌక ద్వారా యూఎస్‌ఎస్‌ఎఫ్-52 మిషన్ విజయవంతమైనట్లు అమెరికా అంతరిక్ష సంస్థ 'స్పేస్ ఎక్స్' ప్రకటించింది. ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగం విజయవంతంగా జరిగిందని పేర్కొంది. నిర్దేశిత కక్ష్యలోకి యూఎస్‌ఎస్‌ఎఫ్-52 చేరుకున్నట్లు వెల్లడించింది. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 8.7 గంటలకు ఫాల్కన్ ద్వారా యూఎస్‌ఎస్‌ఎఫ్-52 మిషన్ నిర్దేశిత కక్షకు చేరుకుందని, ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రంలోగల లాంచ్ కంప్లెక్స్ 39ఏ (ఎల్‌సీ-39ఏ) నుంచి ఈ ప్రయోగం నిర్వహించినట్లు స్పేస్‌ఎక్స్ ప్రకటించింది. ఇది ఐదో ప్రయోగంగా తెలిపింది. అయితే స్పేస్ ఎక్స్‌తో భాగస్వామ్యంపై ది యునైటెడ్ స్టేట్స్ స్పేస్ ఫోర్స్ (యూఎస్‌ఎస్‌ఎఫ్) నవంబరు చివరిలో ప్రకటించిన విషయం తెలిసిందే.

వివేకా హత్యకేసులో కీలక పరిణామం

విశాలాంధ్ర-కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసుకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్, వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డిపై పులివెందుల అర్బన్ పోలీసులు కోర్టులో ఛార్జిషీట్‌ను సమర్పించారు. వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఈ ముగ్గురిపై వివిధ సెక్షన్ల కింద ఈనెల 15న పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి విదితమే. పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు కేసులు నమోదు చేసి శుక్రవారం ఛార్జిషీట్ దాఖలు చేసినట్టు పోలీసులు తెలిపారు. వివేకా హత్యకేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్న క్రమంలో అధికార వైసీపీకి చెందిన కొందరి పేర్లు చెప్పాలని... ఈ కేసులో సాక్షిగా ఉండాలని సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ తనపై పదే పదే ఒత్తిడి చేశారని, విచారణకు పిలిచి సీబీఐ క్యాంపు కార్యాలయంలో తన కుమారుల ఎదుటే తీవ్రంగా కొట్టారని కృష్ణారెడ్డి అభియోగాలు మోపారు. హైదరాబాద్‌లో వివేకా కుమార్తె ఇంటికి వెళ్లినప్పుడు సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి తనను బెదిరించారని... 2021 డిసెంబరులో వివేకా పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. దాదాపు రెండేళ్లపాటు విచారణ జరిపిన పులివెందుల కోర్టు ఈ కేసులో డిసెంబరు 8న తీర్పు వెలువరించింది.

సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించడంతో ఈ ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి. దీనిపై తుది నివేదికను జనవరి 4వ తేదీలోగా సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే పూర్తి స్థాయి విచారణ జరిపిన పులివెందుల పోలీసులు... సిట్ దాఖలు చేసిన రెండు నివేదికల ఆధారంగా దాదాపు 27మంది సాక్షుల వాంగ్మూలాలను కోర్టుకు సమర్పించారు. వివేకా హత్య జరిగిన రోజు సేకరించిన వీడియో క్లిప్పింగ్‌లను కూడా కోర్టుకు సమర్పించినట్లు తెలిసింది.

దేశంలో మరో 797 కోవిడ్ కేసులు

వ్యాపిస్తున్న జేఎన్.1 వేరియంట్

న్యూఢిల్లీ: దేశంలో రోజురోజుకూ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు 797 కొత్త కోవిడ్ కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. మొత్తం ఐదుగురు... కేరళలో ఇద్దరు, మహారాష్ట్ర, పుదుచ్చేరి, తమిళనాడులో ఒక్కొక్కరు చొప్పున మృతిచెందినట్లు తెలిపింది. దేశంలో ఈ ఏడాది మేలో గరిష్ఠంగా 865 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఇదే అత్యధికం అని మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో ప్రస్తుతం క్రియాశీల కేసుల సంఖ్య 4,091కి చేరిందని వెల్లడించింది. కేంద్ర ఆరోగ్యశాఖ వెబ్‌సైట్ ప్రకారం కోవిడ్ వైరస్ బారి నుంచి 4.4 కోట్ల మంది కోలుకున్నారు. ప్రస్తుతం రికవరీ రేటు 98.81 శాతంగా ఉంది. దేశంలో ఇప్పటివరకు 220.67 కోట్ల కోవిడ్ టీకాలు వేశారు. దాదాపు నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా 5.3 లక్షల మంది ఈ మహమ్మారి వల్ల చనిపోయారు. అయితే ఈ ఏడాది డిసెంబరు 5 నాటికి రోజువారీ కేసుల సంఖ్య తగ్గింది. కొత్త వేరియంట్, చల్లని వాతావరణ పరిస్థితుల కారణంగా కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. మరోవైపు నవంబర్ 21 నుంచి డిసెంబర్ 18 నాటికి సేకరించిన నమూనాల్లో డిసెంబర్ 28 నాటికి 145 జేఎన్.1 వేరియంట్ కేసులు నమోదయ్యాయి. జేఎన్.1 అనేది ఒమిక్రాన్ సబ్ వేరియంట్. మొదటి కేసు కేరళలో నమోదైంది.

ఏడు రోజుల ఐసోలేషన్ తప్పనిసరి: కర్నాటక ప్రభుత్వం

రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న క్రమంలో పాజిటివ్ రోగులకు ఏడు రోజుల హోమ్ ఐసోలేషన్ కర్ణాటక ప్రభుత్వం తప్పనిసరి చేసింది . మంగళవారం ఒక్కరోజే రాష్ట్రంలో 74 కొత్త కేసులు నమోదైన క్రమంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం సమావేశమైన కర్నాటక కేబినెట్ సబ్ కమిటీ... ప్రజలందరూ మాస్కులు ధరించాలని సూచించింది. కరోనా లక్షణాలు ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపించరాదని చెప్పింది. కోవిడ్ కేసుల పెరుగుదల, జేఎన్.1 వేరియంట్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో భౌతిక దూరం, ఏడు రోజుల హోమ్ ఐసోలేషన్ వంటివి పాటించాలని సూచించింది.

అధికార లాంఛనాలతో విజయ్‌కాంత్ అంత్యక్రియలు

చెన్నై: తమిళనాడు డీఎండీకే వ్యవస్థాపకుడు, కోలీవుడ్ సీనియర్ నటుడు విజయ్‌కాంత్ (71) అంత్యక్రియలు అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి. కోయంబేడులోని పార్టీ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఆయన భౌతికకాయానికి శుక్రవారం కుటుంబసభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సినీ ప్రముఖులు, బంధువులు, సన్నిహితులు, అభిమానులు అశ్రునయనాల మధ్య తుది వీడ్కోలు పలికారు. అంతకుముందు, డీఎండీకే కార్యాలయంలో ఉంచిన విజయకాంత్ భౌతికదేహాన్ని చెన్నైలోని తీవు తిడల్‌కు తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆ సమయంలో సినీనటులు కమల్ హాసన్, రజనీకాంత్ వచ్చి విజయ్‌కాంత్‌కు నివాళులు అర్పించారు. విజయకాంత్ భౌతిక దేహాన్ని కడసారి చూసేందుకు సామాన్య ప్రజలతోపాటు కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడు ఇక లేరన్న సమాచారంతో బోరున విలపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆ తర్వాత తీవు తిడల్ నుంచి మళ్లీ డీఎండీకే ప్రధాన కార్యాలయానికి విజయ్‌కాంత్ భౌతికదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. విజయ్‌కాంత్‌కు ఎంతో ఇష్టమైన డీఎండీకే ప్రధాన కార్యాలయం ఆవరణలోనే ఆయన భౌతిక దేహానికి అంత్యక్రియలు జరిగాయి. కోయంబేడులోని తన కల్యాణ మండపం అంటే విజయకాంత్‌కు ఎంతో ఇష్టం. పార్టీ ఆవిర్భావంతో దీనిని పార్టీ కార్యాలయంగా మార్చారు. విజయ్‌కాంత్ అనారోగ్య సమస్యలతో గురువారం ఉదయం చికిత్స పొందుతూ మరణించిన సంగతి విదితమే.

పేద పిల్లలకు వరం విద్యా దీవెన

(మొదటిపేజీ తరువాయి)

బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చుల కోసం మరో రూ.4,275 కోట్లు ఇచ్చామని, ఈ రెండు పథకాలకు రూ.16,176 కోట్లు ఖర్చు చేశామన్నారు. పేద విద్యార్థుల బతుకులు మారాలని, గొప్ప డిగ్రీలతో బయటకు రావాలని, డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని సీఎం ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఫీజులు రూ.1,700 కోట్లు బకాయి పెట్టిందని, మీ కోసం మన ప్రభుత్వమే వాటిని చెల్లించిందని చెప్పారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యారంగానికి రూ.12 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని, ఈ రోజు రూ.18,500 కోట్లు ఖర్చు చేశామని, తేడా గమనించాలని కోరారు. దేశ భవిష్యత్ మార్చగలిగిన శక్తి కేవలం చదువుకు మాత్రమే ఉందని, అందువల్లే ప్రభుత్వం స్కూళ్ల దగ్గరి నుంచి ఉన్నత విద్య వరకు విప్లవాత్మకంగా అడుగులు వేసినట్లు చెప్పారు. విద్యారంగానికి సంబంధించి మొత్తం రూ.73 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పటికీ అవినీతి కోసమే అధికారాన్ని ఉపయోగించారని సీఎం జగన్ విమర్శించారు. అవినీతి ద్వారా సంపాదించిన డబ్బును దుష్ట చతుష్టయానికి వాటాలు పంచారని ఆరోపించారు. చెప్పుకోవటానికి చంద్రబాబు ఒక్క మంచి పథకం కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు.

దత్తపుత్రుడు ఓ త్యాగాల తాగ్యరాజు

ఈ దుష్ట చతుష్టయానికి సంబంధించిన గ్యాంగ్‌లో భీమవరం ప్రజలు తిరస్కరించిన దత్తపుత్రుడు గురించి మాట్లాడుదామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఈ దత్తపుత్రుడు పక్క రాష్ట్రంలో శాశ్వత నివాసం ఉంటూ పక్కవాడు సీఎం కావాలని పార్టీ పెట్టిన ఏకైక నాయకుడని తెలిపారు. ఈ దత్తపుత్రుడు వ్యవహారం బాబు ముఖ్యమంత్రి అయితే చాలు. అవే మాకు వందల కోట్లు అన్నట్లుగా ఉందన్నారు. పొత్తులో ఎన్ని సీట్లు ఇచ్చినా ఓకే, ఇవ్వకపోయినా ఓకే... చిత్తం ప్రభు అంటూ త్యాగాల త్యాగరాజును ఈ దత్తపుత్రుడిలో చూస్తామని సీఎం ఎద్దేవా చేశారు. మన ఇంట్లోనూ ఆడవాళ్లకు ఉన్నారని, స్త్రీ విలువ తెలియని ఇలాంటి వారు నాయకులయితే, ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలయితే నిజంగా మన ఆడబిడ్డల పరిస్థితి ఏమిటని, ఇలాంటి వారికి ఓటు వేయడం ధర్మమేనా అని ప్రశ్నించారు. ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలకు రంగురంగుల మేనిఫెస్టో చూపిస్తారని, ఆ తరువాత మోసం చేస్తారని అన్నారు. ఒక్క రూపాయి లంచం, వివక్ష లేకుండా బటన్ నొక్కి నేరుగా పేదల ఖాతాల్లోకి డబ్బులు పంపించింది మీ జగనేనని ముఖ్యమంత్రి తెలిపారు. చంద్రబాబు, పవన్‌కు సింగిల్‌గా పోటీ చేసే దమ్ము లేదని దుయ్యబట్టారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సీఎం జగన్ భీమవరంలో జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు లూథరన్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు శుక్రవారం ఉదయం10.40 గంటలకు చేరుకున్నారు. సీఎంకు హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికిన వారిలో ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఎం.నాగార్జున, పౌర సరఫరాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి నాగేశ్వరరావు, హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవి ప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ముదునూరి నాగ రాజావరప్రసాద రాజు, గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, పుప్పాల శ్రీనివాస రావు, కొటారు అబ్బయ్య చౌదరి, తలారి వెంకట్రావు, పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంపీ, రీజినల్ కోఆర్డినేటర్ పి.వి.మిధున్ రెడ్డి, శాసన మండలి సభ్యులు తలశిల రఘురాం, కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, ఏపీ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మేడిది జాన్సన్, నరసాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ బి.శ్రీ వెంకట రమణ, జె.హైమావతి, సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ పి.వి.ఎల్.నరసింహరాజు, జిల్లా సహకార మార్కెటింగ్ చైర్మన్ వేంద్ర వెంకట స్వామి, ఎంపీపీ పెరిచేర్ల నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, వివిధ కార్పొరేషన్ల, సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, అధికారులు తదితరులు ఉన్నారు.

నిరవధిక సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెబాట తప్పదని చెప్పామన్నారు. డిసెంబర్ 24న అధికారులు 10 రోజులు గడువు అడగడంతో 27న జరగాల్సిన మున్సిపల్ సమ్మెను తమ జేఏసీ జనవరి 6కు వాయిదా వేసిందన్నారు. ఈ నెల 28వ తేదీన పురపాలక శాఖమంత్రి సురేశ్‌బాబు తమతో జరిపిన చర్చల్లో స్పష్టత రాలేదని, దీనితో జేఏసీ సమావేశమై డిసెంబర్ 30న రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు జరిపి... జనవరి 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకుదిగాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజారోగ్య సేవలకు కలిగే ఆటంకాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, నాయకులు భజంత్రి శ్రీనివాస్, దుర్గారావు, నాసర్ వలి, తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

కరోనా 'పరీక్ష'

(మొదటిపేజీ తరువాయి)

పంపాల్సిన అవసరం ఉంది. ఇటీవల వైకుంఠ ఏకాదశ సందర్భంగా ఆలయాల దగ్గర భక్తుల రద్దీ పెరిగిపోయింది. క్రిస్మస్ పండుగతో చర్చిల దగ్గర క్రైస్తవుల రద్దీ మరింతగా పెరిగింది. జనవరి 1న నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భారీగా యువత, ప్రజలు పెద్దఎత్తున బయటకు తరలిరానున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి రాకపోకలు కొనసాగుతాయి. దీంతో కరోనా కేసులు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. కరోనా కేసుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని నియంత్రించాలి

రాబోయే రోజుల్లో కరోనా కేసులు మరింత పెరిగితే వైద్య సౌకర్యాలు అదనంగా అవసరమవుతాయి. వైరస్ బారిన పడిన ప్రజలు ఆస్పత్రులకు వెళ్లే అవకాశాలున్నాయి. దానిని దృష్టిలో ఉంచుకుని అన్ని ఆస్పత్రుల్లో తగినంతగా బెడ్ల సౌకర్యం కల్పించాలి. లేకుంటే పేద, మధ్యతరగతి వర్గాల వారంతా కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉంది. మూడు విడతలుగా కరోనా కేసులతో చాలా మంది ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ప్రాణాలు కోల్పోయారు. అక్కడ యాజమాన్యం లక్షల రూపాయల్లో బిల్లులు వేసి ముక్కుపిండీ మరి వసూలు చేసింది. కొంత డబ్బు తగ్గినా, అవి చెల్లించాకే మృతదేహాలను తీసుకెళ్లాలని పట్టుపట్టిన విషయం విదితమే. కరోనా కారణంగా కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యం ఆర్థికంగా లబ్ధి పొందారు. అత్యవసరంగా వచ్చిన కరోనా రోగులకు ఆక్సిజన్, ఇంజక్షన్ల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేశారు. విజయవాడలోని చాలా హోటళ్లను కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యం అద్దెకు తీసుకుని అక్కడ రోగులను ఉంచి కమర్షియల్ తరహాగా వ్యాపారం చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా వాటికి అధికారులు అనుమతులు ఇవ్వడంతోనే ఈ దుస్థితి నెలకొంది. విజయవాడ స్వర్ణ హోటల్‌లో రమేశ్ హాస్పిటల్ యాజమాన్యం కరోనా బెడ్లను ఏర్పాటు చేసి వైద్యసేవలందిస్తుండగా, అక్కడ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి కరోనా రోగులు చనిపోయారు. ఈ సంఘటనలో నమోదయిన కేసు ఇప్పటికీ కొలిక్కి రాలేదు. విజయవాడ, గుంటూరులో అనేక అస్పత్రులలో కరోనాను ఒక వ్యాపారంగా భావించి, సొమ్ము చేసుకున్నాయనే విమర్శలున్నాయి. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

విద్యార్థులకు కఠిన పరీక్షే

కరోనా కేసుల నమోదుతో విద్యార్థులకు పరీక్షలు మరింత కఠినంగా మారనున్నాయి. వార్షిక పరీక్షల సన్నద్ధత ప్రశ్నార్థకంగా మారుతోంది. కరోనా కారణంగా రెండు విద్యా సంవత్సరాలు విద్యార్థుల చదువులు సాఫీగా కొనసాగలేదు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సన్నదమైతే, కరోనా ఉధృతితో పరీక్షలను నిర్వహించలేకపోయారు. పరీక్ష ఫీజు చెల్లించిన విద్యార్థులందరినీ ప్రభుత్వం ఉత్తీర్ణులుగా ప్రకటించి, వారిని ఉన్నత తరగతులకు ఉత్తీర్ణులను చేసింది. ఈ ప్రభావంతో చదువులో వెనుకబడిన విద్యార్థులు పై తరగతులకు వచ్చినప్పటికీ, ప్రాథమిక అంశాల్లో పట్టు రాలేదు. కేంద్రంలోని సీబీఎస్ఈ టెన్త్, ప్లస్ 1, ప్లస్ 2 (ఇంటర్మీడియట్) పరీక్షలు ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఆయా విద్యార్థులకు ఫ్రీ బోర్డు పరీక్షలను పాఠశాలలు నిర్వహిస్తున్నాయి. ఏపీలోనూ ఎస్ఎస్‌సీ బోర్డు నిర్వహించే టెన్త్, ఇంటర్ బోర్డు పరీక్షలు మార్చిలో జరగనున్నాయి. జేఈఈ, నీట్ పరీక్షలకు షెడ్యూలు వచ్చింది. ఏపీలో గ్రూప్ 1, 2 ప్రిలిమ్స్ పరీక్షలకు తేదీలు ఖరారు చేశారు. అయితే కరోనా కారణంగా విద్య, పోటీ పరీక్షలకు మళ్లీ అసౌకర్యం ఎదురయ్యే పరిస్థితులున్నాయి. ఈలోగా కరోనా కేసులు తగ్గితే ఎలాంటి ఆటంకాలు ఉండబోవు. రాబోయే నెల రోజుల్లో మరింతగా కేసులు పెరిగితే మాత్రం పరీక్షలు వాయిదా పడే ప్రమాదం ఉంది. మళ్లీ కరోనా తగ్గాక పరీక్షలు నిర్వహిస్తే ఈలోగా ఎన్నికల షెడ్యూలుతో ఆటంకం కలగనుంది.

కరోనా కేసుల ఉధృతి పెరిగితే దేశ వ్యాప్తంగా జరగబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేసే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలో అనుకున్న సమయానికి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నా?, లేక ఎన్నికలు జరగాలన్నా... అవి కరోనా కేసుల ఉధృతిపైనే ఆధారపడి ఉంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కరోనా వ్యాప్తి నివారణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి కేసులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

సీట్ల సర్దుబాటుపై కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమయ్యారు. రాబోయే ఎన్నికల్లో పొత్తులతో పాటు సంస్థాగత సమస్యలపైనా ప్రధానంగా చర్చించారు. 'ఇండియా' పార్టీలతో కలిసి పోటీ చేయబోయే రాష్ట్రాల నాయకులతో ఐదుగురు సభ్యులతో కూడిన కాంగ్రెస్ నేషనల్ అలయెన్స్ కమిటీ చర్చలు ప్రారంభించింది. ఇవి శనివారం కూడా కొనసాగనున్నాయి. ఆయా రాష్ట్రాల్లోని ఏయే స్థానాల్లో కాంగ్రెస్ బలంగా ఉంది తదిరత అంశాలతో కూడిన నివేదికను పార్టీ అధ్యక్షుడికి ఈ కమిటీ ఇవ్వనుంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరుగుతుండగా వచ్చే వారం నుంచి ప్రక్రియ అధికారికంగా ప్రారంభమవుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో అభిప్రాయ బేధాలు ఉండవచ్చు కానీ దేశాన్ని దృష్టిలో పెట్టుకొని ఇండియా కూటమిదే తుది నిర్ణయం కాబోతోందని వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలావుంటే భారత న్యాయ యాత్ర సాగే రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, కీలక నాయకులతో జనవరి 4న సమావేశం జరగనుంది. జనవరి 8న యాత్ర వెళ్లే మార్గం గురించి వివరాలు ప్రకటిస్తారు.

రోజుకు 120 కిమీల లెక్కన పాదయాత్ర సాగబోతుంది. యాత్రలో భాగంగా బహిరంగ సభలు, స్థానికులు, అణగారిన వర్గాలతో సమావేశాలు జరుగుతాయి. మణిపూర్ నుంచి జనవరి 14న భారత్ న్యాయ యాత్రను రాహుల్ ప్రారంభిస్తారు. ఈ యాత్ర 14 రాష్ట్రాలు, 85 జిల్లాల మీదుగా సాగుతుంది. మార్చిలో మహారాష్ట్రలోని ముంబైలో ముగియనుంది. మణిపూర్, నాగాలాండ్, అసోం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఒడిశా, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో రాహుల్ పాదయాత్ర సాగుతుంది. ఇండియా కూటమి నేతలు పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

పస్తులుండాల్సిందేనా!

(మొదటిపేజీ తరువాయి)

కీలకం. తాజా ధరల పెరుగుదల ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచవచ్చు. ఎల్‌నినో ప్రభావం రాబోయే నెలల్లో సరఫరాను మరింత కఠినతరం చేస్తుందనే భయాల మధ్య కొన్ని దేశాలు తగినంత నిల్వలు చేసుకునేందుకు కొనుగోళ్లు పెంచుతున్నాయి. ఆహార ద్రవ్యోల్బణం 8.70 శాతానికి చేరింది. అక్టోబరులో ఇది 6.61 శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదల ఫలితంగా నవంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం మూడు నెలల క్షీణత తర్వాత 1.5 శాతానికి పడిపోయింది. ఇలా ఆహార పదార్థాల ధరలు అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రకరకాల సర్కస్‌లు నడుపుతోంది. ఒకవైపు ఉల్లి కిలో రూ.25 పలుకుతోంది. తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని, బియ్యం, గోధుమలు, పంచదార ఎగుమతులపై ఆంక్షలు విధించింది.

తెలుగు రాష్ట్రాల్లో ధరల మోత

తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు భారీగా పెరిగాయి. మూడేళ్లుగా దిగుబడులు తక్కువగా ఉన్నాయి. దీనికితోడు ఈ ఏడాది మిచౌంగ్ తుపాను దెబ్బకు పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో వరి సాగు మరింత దెబ్బతింది. ఇది ధరలపై గణనీయమైన ప్రభావం చూపింది. ఈ ఏడాది పంటలు చేతికి వచ్చే సమయానికి కోస్తా జిల్లాలను తుపాను ముంచెత్తింది. సరిగ్గా పంటలు చేతికి వచ్చే సమయానికి భారీ వర్షాలు కురవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని దక్కించుకోలేకపోయారు. నవంబరు చివరి వారం నుంచి డిసెంబరు మొదటి వారమంతా ఏపీతో పాటు తెలంగాణలో వర్షాలు కురిశాయి. మిచౌంగ్ తుపాను ప్రభావానికి కోతలకు వచ్చిన పంట పూర్తిగా వాలిపోయింది. పంట రోజుల తరబడి నీటిలో నాని పోవడంతో పనికి రాకుండా పోయింది. ఏపీలో రైతులు ఒక్క కృష్ణా డెల్టా పరిధిలోనే 13 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కృష్ణా డెల్టా విస్తరించింది. తుపాను మొదట తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో విధ్వంసం సృష్టించింది. తుపాను తీరం దాటిన తర్వాత గోదావరి జిల్లాలు నష్టపోయాయి. ఇలా రాష్ట్రంలో వరి పండించే లక్షల ఎకరాల పంటను నష్టపోయారు. అధికారిక లెక్కల్లోనే లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. అటు తెలంగాణలో కూడా ఖరీఫ్‌లో పంట నష్టం భారీగా ఉందని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో అనివార్యం బియ్యం ధరలు పెంచాల్సి వస్తోందని చెబుతున్నారు. మిల్లుల్లో ఉన్న ధాన్యం ఐదారు నెలల వినియోగానికి వస్తాయని, అదే సమయంలో ధరలు పెంచక తప్పదని, ధాన్యం కొనుగోలు చేయడానికి అవకాశాలు లేకపోవడంతో ధరలు సహజంగానే పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. గత నెలలో రూ.1400గా ఉన్న 26 కిలోల బస్తా ధర ప్రస్తుతం రూ.1550-1600కు చేరింది. ప్రతి వారం ధరలు పెరుగుతాయని, జనవరి నెలాఖరుకు 26 కిలోల బస్తా ధర రూ.2 వేలకు చేరొచ్చని హోల్‌సేల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వచ్చే రబీ పంటపైనే ధరలు ఆధారపడి ఉంటాయని చెబుతున్నారు. రబీలో కూడా పంట సరిగా రాకపోతే ఈ ఏడాది జనానికి గడ్డు పరిస్థితులు తప్పవని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బ్రాండెండ్ రకం సన్న బియ్యం ధరలు కిలో రూ.60-62 వరకు పలుకుతున్నాయి. మరో వారం పది రోజుల్లో ఈ ధరలు రూ.70కు చేరుతాయని చెబుతున్నారు. ఆ తర్వాత మరో ఐదు రూపాయలకు అటుఇటుగా పెరిగి బస్తా రూ.2 వేల వద్ద స్థిరపడుతుందని అంచనా వేస్తున్నారు. ఇదిలాఉండగా, పౌర సరఫరాల శాఖ మార్కెట్ ధరలు, నిత్యావసర వస్తువుల విక్రయాలపై నియంత్రణ కోల్పోయింది. ధరల నియంత్రణ, బియ్యం, పప్పు ధాన్యాల వంటి వస్తువుల ధరలపై గతంలో పౌరసరఫరాల శాఖ అజమాయిషీ ఉండేది. ఒక్క సీజన్‌లో పంట నష్టం జరిగితే అమాంతం ధరలు పెంచేస్తున్నా వాటిని నియంత్రించే చర్యలు మాత్రం కొరవడుతున్నాయి. ప్రభుత్వం నుంచి ధరల నియంత్రణ కట్టడి చర్యలు లేకపోవడంతో మిల్లర్లు నిర్ణయించిందే ధర అవుతోంది.

రైతు రుణమాఫీ జరగాల్సిందే

రామచంద్రయ్య, జగదీశ్ డిమాండ్

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: రైతుల ఆత్మ హత్యలు నివారించాలంటే వారికి రుణమాఫీ తప్పనిసరిగా జరగాలని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం 13 వ జిల్లా మహా సభలు శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజీఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముందుగా ఆపార్టీ సీనియర్ నాయకుడు సూర్యనారాయణ రెడ్డి సీపీఐ జెండాను ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్మారక స్థూపాన్ని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య ఆవిష్కరించగా... సీపీఐ, రైతు సంఘం నాయకులు పుష్పాంజలి సమర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్, మధు యాదవ్, నారాయణ అధ్యక్షతన జరిగిన మహా సభలకు రామచంద్రయ్య, జగదీష్‌తో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తే రైతులు సుభిక్షంగా ఉంటారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు సహాయం చేస్తే ఆర్థిక సంక్షోభం వస్తుందని పాలక ప్రభుత్వాలు వెల్లడించడం దుర్మార్గమని... కార్పొరేట్ కంపెనీలు లక్షల కోట్ల రుణాలు ఎగ్గొడితే ఆర్థిక సంక్షోభం రాదా అంటూ ఆయా ప్రభుత్వాలను సూటిగా ప్రశ్నించారు.రైతు లేకపోతే కూడు దొరకదని దేశానికి అరిష్టమని విచారం వ్యక్తంచేశారు. గతంలో అనేక రాష్ట్రాల్లో రైతు ఉద్యమం జరిగితే ప్రధాని మోదీ దిగివచ్చి నల్ల చట్టాలను రద్దు చేశారని గుర్తు చేశారు. కాగా రాజమండ్రి లో 8,9 తేదీల్లో రైతు సంఘం రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీజేపీ పాలనలో దేశ వ్యాప్తంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, కనీస మద్దతు ధర, మౌలిక సదుపాయాలు పూర్తిగా కరువయ్యాయని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర వ్యాప్తంగా బలపడిందని, అనేక ఉద్యమాలతో అనేక విజయాలు సాధించామన్నారు. కృష్ణా జలాలు సాధించడమే కాకుండా దిల్లీలో జరిగిన రైతు ఉద్యమంతో నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని రైతు వ్యతిరేక ప్రభుత్వాలకు చరమ గీతం పాడాల్సిందేనని రైతు సంఘం నాయకులకు పిలుపు నిచ్చారు. ఆహారధాన్యాలను ఉత్పత్తి చేసేటటువంటి రైతులకు ప్రభుత్వాలు ఏమాత్రం సహకరిస్తున్నాయని ప్రశ్నించారు.వ్యవసాయ అభివృద్ధికి ఏమాత్రం చేయూతనివ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 80 లక్షల ఎకరాల భూమి సాగు ఉంటే ప్రభుత్వ లెక్కల ప్రకారమే 49 లక్షల ఎకరాల భూమిలో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు పండలేదన్నారు.17,18 జిల్లాల్లో 470 మండలాల్లోపంట పండలేదని ప్రభుత్వం నివేదికలు చూపిస్తున్నయని అన్నారు. ఈ ఏడాది అధిక వర్షాలు, తుపాను వల్ల అనంతపురం జిల్లాలో 22 లక్షల ఎకరాల్లో పంటలన్ని పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, నారాయణ స్వామి, కేశవ రెడ్డి, శ్రీరాములు, మానవ హక్కుల సంఘం నాయకుడు బాషా, పండ్ల తోటల సంఘం నాయకుడు మురళి, సీపీఐ, రైతు సంఘం నాయకులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, ఏపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామక్రిష్ణ,నారాయణ స్వామి, కేశవ రెడ్డి, శ్రీరాములు, మానవ హక్కుల సంఘం నాయకుడు బాష, పండ్ల తోటల సంఘం నాయకుడు మురళి, సీపీఐ, రైతు సంఘం నాయకులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతును తక్షణమే ఆదుకోవాలి

జంగాల అజయ్‌కుమార్ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు: మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు మల్లయ్యలింగం భవన్ నుంచి వీడియో సందేశాన్ని శుక్రవారం విడుదల చేశారు. తుపాను కారణంగా పంట దెబ్బతిని, పెట్టుబడి మొత్తం నీటిపాలైందని, తుపాను వల్ల నష్టపోయిన రైతును ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతాంగంతో పాటు కమ్యూనిస్టులు, ఇతర రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి వివిధ రూపాలలో విజ్ఞాపనలు చేసినప్పటికీ చెవిడివాడి ముందు శంఖం ఊదినట్లు అయిందని జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. గుంటూరు జిల్లాలోని అనేక ప్రాంతాలలో వరిపై రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టిన కౌలు రైతు మొత్తం నష్టపోయాడని తెలిపారు. మిర్చి రైతు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాడని, అరటి రైతు రూ.60 వేల వరకు కౌలు, లక్ష పైన పెట్టుబడి పెట్టి నష్టపోయారని వివరించారు. ప్రతి రైతును ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం...ఆచరణలో విఫలమైందన్నారు. పంట నష్టాన్ని పరిశీలించడానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేవలం స్టేజీకే పరిమితమై, అధికారులు చెప్పిందే విన్నారని, క్షేత్రస్థాయిలో పంట పరిశీలించకపోవడం శోచనీయమన్నారు. అన్నం పెట్టే రైతును ఆదుకునే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేకపోవడం విచారకరమన్నారు. తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి రైతుకు న్యాయం చేయకపోతే సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విశాఖ ఉక్కును నిర్వీర్యం చేస్తున్న కేంద్రం కుట్రలపై స్వతంత్ర దర్యాప్తు

విశ్రాంత ఐఏఎస్ శర్మ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఎన్నో విధాలుగా బలహీన పరచి, ఒక ప్రైవేటు సంస్థకు తక్కువ ధరలో అమ్మే దిశగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాలపై స్వతంత్ర దర్యాప్తు కు ఆదేశించాలని రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఈ ఏ ఎస్ శర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బహిరంగ లేఖను విడుదల చేశారు. ప్రజా ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 1971లో, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రారంభించిందని, అప్పటి భూసేకరణ చట్టం కింద, రాష్ట్ర ప్రభుత్వం... కర్మాగారానికి కావలసిన సుమారు 20వేల ఎకరాల భూములను రైతుల నుంచి సేకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వ రంగంలో నిర్మిస్తున్న సంస్థ కోసమే భూములు సేకరిస్తున్నట్లు నాడు నమ్మబలికారని తెలిపారు. అందువల్ల ఇప్పుడు విశాఖ ఉక్కును ప్రైవేటు సంస్థలకు అప్పగించడం చట్టవిరుద్ధ మవుతుందని... భూములు కోల్పోయిన వేలాదిమంది రైతులకు ద్రోహం చేయడమేనని తెలిపారు. విశాఖ ఉక్కుకు స్వంత ఇనుప గనులను కేటాయించక పోవడం, కేంద్రం ఉద్దేశపూర్వకంగా చేస్తున్న వ్యూహానికి రుజువు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయవద్దని కేంద్రాన్ని డిమాండ్ చేయడానికి బదులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ప్రైవేటు కంపెనీ విశాఖ ఉక్కు ను స్వాధీనం చేసుకోగానే, కర్మాగారంలో పని చేస్తున్న సుమారు 16,000 మంది ఉద్యోగుల భవిష్యత్, ముఖ్యంగా 6800 వెనుకబడిన తరగతులకు చెందిన ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత ప్రయాణం

ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఈయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగి భార్యాభర్తలకు సంక్రాంతి కానుకగా ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తూ గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య శుక్రవారం ఒక ప్రకటన విడుదలచేశారు. ఉమ్మడి సంస్థగా ఉన్నప్పుడే ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌గా చేసిన విజ్ఞప్తుల మేరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగికి, జీవిత భాగస్వామికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. ఏసీతోపాటు అన్ని సర్వీసులకు సగం చార్జీల వర్తింపజేసేలా గుర్తింపు కార్డులు ఇచ్చారు. ఇప్పుడు కూడా ఆర్టీసీలో ఉద్యోగుల భార్యాభర్తలకూ సూపర్ లగ్జరీ బస్సుల వరకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలి. ఆపై ఏసీ బస్సులకు సగం చార్జీలు వర్తింపజేయాలి. దీంతో పిల్లలు చదువుల నిమిత్తం లేక ఇతర అవసరాల కోసం ప్రయాణానికి ఉద్యోగులకు వెసులబాటు ఉంటుందని గతంలో చర్చించగా యాజ మాన్యం అంగీకరించింది. అప్పటి ఆర్టీసీ ఎండీ బదిలీ, సంస్థ విలీనం నేపథ్యంలో ఈ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. ఉద్యోగి, వారి కుటుంబ సభ్యుల ప్రయోజనాల దృష్ట్యా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలి. నూతన సంవత్సరం... సంక్రాంతి కానుకగా దీనిని ప్రకటించాలి' అని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

సంక్షోభంలో వ్యవసాయం

పట్టించుకోని పాలకులు

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలో కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-ముసునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అస్తవ్యస్త విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ శుక్రవారం ఏలూరు జిల్లా ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలో జరిగింది. రైతు నాయకులు పి.సోమశేఖర్, గన్ను వెంకటరావు, మడుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. కూచిపూడి లక్ష్మీనారాయణ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రైతుసంఘం పతాకాన్ని కేడీసీసీ మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, రైతు ఆత్మహత్యలు నివారిస్తానని ప్రధాని మోదీ వాగ్దానం చేశారని, చివరికి రైతాంగాన్ని నట్టేట ముంచారని విమర్శించారు. పాలకుల విధానాల కారణంగా ప్రతి కుటుంబంపై రుణభారం పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై రూ.2 లక్షల భారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, అయినా పంటనష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ఇప్పటికీ ముందుకు రాకపోవడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించడం వలన రైతులకు నష్టం కలుగుతుందన్నారు. రైతుల అభివృద్ధి కోసం 65 కమిషన్లు వేసినా ఫలితం కనిపించలేదన్నారు. ప్రభుత్వాలు ఓట్ల కోసం మాయమాటలు చెప్పి రాజకీయ వ్యాపారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతి రైతు కుటుంబానికి తక్షణమే రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఐక్య పోరాటానికి ముందుకు రావాలని రైతులకు పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ అన్నం పెట్టే రైతు పంట నష్టాలతో దుర్భర జీవితం గడుపుతుంటే ప్రభుత్వాలకు చీమకుట్టినట్టైనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాలలో ధరలు పెరుగుతున్నా రైతు పండించిన పంటకు మాత్రం మద్దతు ధర లభించడం లేదని విమర్శించారు. రైతాంగం అప్పుల పాలు అవుతున్నారని, రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో ఉండటం బాధిస్తోందన్నారు. రైతు సంక్షేమం చేస్తామన్న ప్రభుత్వాలు రైతు ఉద్యమాలను అణచడానికి ప్రయత్నించడం నిరంకుశ పాలనకు పరాకాష్ట అని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం ద్వారా రైతు మెడపై కత్తి పెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. రైతన్న సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సాగునీటి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను అన్నదాతలు తిప్పికొట్టారని గుర్తుచేశారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ రైతులను కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోవడంతోనే వ్యవసాయరంగంలోకి కొత్తగా ఎవరూ రావడం లేదన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, అయినా ముఖ్యమంత్రి జగన్ మాత్రం జిల్లాలో కరువు మండలాలు ప్రకటించలేదని విమర్శిం చారు. తక్షణమే జిల్లాలో కరువు మండలాలు ప్రకటించి రైతులకు పంటల బీమా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో రైతు సమస్యలపై అనేక తీర్మానాలను కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు ప్రవేశపెట్టారు. రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు దొంతా కృష్ణ, కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేశ్వర రావు, సీపీఐ నాయకులు సురేశ్ చంద్ర బెనర్జీ, బత్తుల వెంకటేశ్వరరావు, చాట్ల పుల్లారావు, కూచిపూడి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర నాయక్ ఆలపించిన విప్లవ గేయాలు సభికులను అలరింపజేశాయి.

వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలి

5న కలెక్టరేట్ల ఎదుట నిరసన

8 ,9 తేదీల్లో సీఎంకు ఉత్తరాలు: గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడప రూరల్: రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకులు ప్రభుత్వాలకు వెట్టి చాకిరీ చేస్తున్నారని, వారి జీవితాలలో అభివృద్ధి లేదని, ఇప్పటికైనా వీఆర్ఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని పక్షంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఏపీ వీఆర్ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య హెచ్చరించారు. శుక్రవారం కడప హోచ్‌మిన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం రూ.10,500 వేతనంతో కుటుంబాలు ఎలా గడుస్తాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని మండిపడ్డారు. అత్యంత పేదలైన వీఆర్ఏలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందినవారని తెలిపారు. ఉద్యోగులందరికీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన సీఎం జగన్ వీఆర్ఏలను కూడా మోసగించాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు కోసం దశలవారీ ఆందోళన చేపడతామని తెలిపారు. జనవరి 5వ తేదీన నిరసన కార్యక్రమాలు, 8,9 తేదీల్లో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమం, మెయిల్స్, టెలిగ్రామ్స్ పంపే కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ప్రభుత్వం ఇలానే నిర్లక్ష్యం వహిస్తే సమ్మెకు వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం, ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, కోశాధికారి ఇరుపోతు శ్రీనివాసులు వర్మ, కడప జిల్లా అధ్యక్షులు కోడూరు పుల్లయ్య, ఉపాధ్యక్షులు నాగదాసరి ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ ఏదీ?

దుర్గాభవానీ ప్రశ్న

మహిళా సమాఖ్యలో చేరిన ఐద్వా నాయకులు

విశాలాంధ్ర-డోన్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, రోజురోజుకీ వారిపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ విమర్శించారు. శుక్రవారం డోన్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఎం అనుబంధ సంఘం ఐద్వా నుంచి సీపీఐ అనుబంధ ఏపీ మహిళా సమాఖ్యలో షమీమ్‌బేగం, అమృతారెడ్డితో పాటు 10 మంది మహిళలు చేరారు. దుర్గాభవానీ అధ్వర్యంలో వీరం దరికీ మహిళా సమాఖ్య కండువాలు కప్పి ఆహ్వానించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్ పి.సుంకయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మహిళలకు అనేక చట్టాలు సాధించిన ఘనచరిత్ర మహిళా సమాఖ్యకే దక్కిందన్నారు. అయితే బీజేపీ ప్రభుత్వంలో రోజురోజుకు మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. భవిష్యత్తులో ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రతి పిలుపును అందుకుని డోన్ మహిళా సమాఖ్య పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఆసన్నమైందని తెలిపారు. అధికారంలోకి రావడం కోసం నాయకులు అనేక మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని గద్దెనెక్కిన తర్వాత మహిళలకు చేసిన వాగ్దానాలు పెడచెవిన పెట్టారన్నారు. పాలకులు అవలంబిస్తున్న మహిళా, ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని దుర్గాభవానీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. సుగుణమ్మ, సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు ఎస్.పులిశేఖర్, బి.నారాయణ, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హసీనా, లక్ష్మీదేవి, దేవమణి మాలతితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జర్నలిజానికి విషయ పరిజ్ఞానం అవసరం

సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

జర్నలిజం డిప్లొమా అభ్యర్థులకు సర్టిఫికెట్ల అందజేత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జర్నలిజం పవిత్ర వృత్తి అని, ఇందులో రాణించాలంటే విషయ పరిజ్ఞానం అవసరమని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రొఫెసర్ బాల మోహనదాస్ సెమినార్ హాలులో శుక్రవారం జరిగిన జర్నలిజం డిప్లొమో పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, మార్కుల జాబితా పంపిణీ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. కొమ్మినేని మాట్లాడుతూ జర్నలిస్టులుగా రాణించా లనుకునే వారు 1953లో రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి జరిగిన పరిణామాలపై సమగ్ర అవగాహన ఉండాలని సూచించారు. వార్త రాయడానికి కనీస నియమాలు తెలుసుకోవాలని, విలువలతో కూడిన జర్నలిజం చేయాలని ఉద్బోధించారు. వార్తను వార్తగా రాయడం, రెండో పక్షం అభిప్రాయాన్ని జోడించి రాయడం, నిజాన్ని నిర్ధారించుకునే ప్రయత్నం చేయడం జర్నలిజం మౌలిక సూత్రాలని తెలిపారు. నాగార్జున యూనివర్సిటీతో కలిసి సీఆర్ మీడియా అకాడమీ నిర్వహించిన డిప్లొమోను సద్వినియోగం చేసుకుని జర్నలిజం రంగంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కోర్సు నిర్వహణలో సహకరించిన వైస్ చాన్సలర్ రాజశేఖర్, జర్నలిజం విభాగపు అధిపతి అనిత, కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించిన బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఎల్‌వీకే రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు మాట్లాడుతూ మాటను మించిన ఆభరణం లేదనేది ఆర్యోక్తి అని, పత్రికల్లో రాసేట ప్పుడు గానీ, ప్రసార మాధ్యమాల్లో మాట్లాడేటపుడుగానీ సందర్భోచితంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. జర్నలిజం అంటే వ్యూస్ (అభిప్రాయా లను)ను న్యూస్(వార్త)గా మార్చడం కాదన్నారు. జర్నలిస్టులు జనం తరపున వకాల్తా తీసుకోవాలని సూచించారు. ఫీచర్ జర్నలిజం, ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం, లీగల్ జర్నలిజం వంటి అనేక కొత్త కొత్త విభాగాలు వస్తున్నాయని, వాటిపై పట్టు సాధించడానికి నిత్యం చదువుతూ ఉండాలని ఆయన కోరారు. సుదీర్ఘకాలం జర్నలిజం రంగంలో సునిశితత్వం, సున్నితత్వంతో రాణిస్తోన్న కొమ్మినేని శ్రీనివాసరావును, సాధారణ జర్నలిస్టుగా జీవితం ప్రారంభించి... హిందూ దినపత్రికకు రెసిడెంట్ ఎడిటర్ గా ఎదిగిన రెడ్డం అప్పాజీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ జర్నలిజం విభాగంలో ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయని, జర్నలిజం సాహసోపేతమైన వృత్తి అని స్పష్టం చేశారు. హిందూ దినపత్రిక ఆంధ్రప్రదేశ్ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డం అప్పాజీ మాట్లాడుతూ ఏ వృత్తిలోనైనా పోటీ పెరిగినప్పుడు అవకాశాలు కూడా పెరుగుతాయని, జర్నలిజం వృత్తి ఇందుకు మినహాయింపు కాదన్నారు. క్రమశిక్షణ, నిరంతర కృషి మంచి భవిష్యత్తును అందిస్తాయన్నారు.

ఎల్‌వీకే రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం డిప్లమో కోర్సును నిబద్ధతతో అభ్యర్థులకు ప్రయోజనం చేకూర్చేలా నిర్వహించడంలో సహకరించిన కొమ్మినేని శ్రీనివాసరావుకు, వైస్‌చాన్సలర్ రాజ శేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి జి.అనిత, పి.విజయబాబు సతీమణి శారద, సీఆర్ మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ తదితరులు మాట్లాడారు. అనంతరం జర్నలిజం డిప్లొమాలో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలను రాజ శేఖర్, కొమ్మినేని శ్రీనివాసరావు, పి.విజయబాబు, రెడ్డం అప్పాజీ అందజేశారు. జర్నలిజం డిప్లొమోలో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు, వర్కింగ్ జర్నలిస్టులకు అడ్వాన్స్డ్ సాఫ్ట్ వేర్ టూల్స్ ఫర్ ఈ- పబ్లిషింగ్‌పై నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ ఈ.శ్రీనివాసరెడ్డి శిక్షణ ఇచ్చారు. నాగార్జున యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ బి.నరసారెడ్డి, అదనపు కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ రెడ్డి ప్రకాశరావు, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్‌డీ ఎస్. శ్రీనివాస జీవన్, ఏఓ ఎంఎస్ఎన్ మూర్తి, డీపీఓ ఎం. లోవరాజు పాల్గొన్నారు.

విశాఖ ఎంపీ ఇంటి ముందు అంగన్‌వాడీల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అంగన్‌వాడీల సమ్మె 18వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ విశాఖలో వినూత్న రీతిలో రోజుకొక చోట అంగన్‌వాడీలు ఉద్యమిస్తున్నారు. శుక్రవారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంటి ముందు బైఠాయించారు. సుమారు మూడు గంటల పాటు ధర్నా చేసిన అనంతరం ఎంపీ అంగన్‌వాడీల వద్దకొచ్చి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీకి అంగన్‌వాడీల యూనియన్ నేత వై.తులసి అధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనేక రకాల పనులు తమతో చేయిస్తోందని... వివిధ రకాల యాప్స్ ద్వారా పని ఒత్తిడి తీవ్రంగా ఉన్నప్పటికీ వేతనాలు పెంచకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ స్పందిస్తూ.. అంగన్‌వాడీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సుమారు 300 మంది అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నేతలు పాల్గొన్నారు.

వైసీపీకి వ్యతిరేక పవనాలు

మరో కీలక నేత రాజీనామా



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీకి ఎదురుగాలి మొదలైంది. పరిపాలన రాజధాని పేరిట హడావిడి చేసిన వైసీపీకి విశాఖ కేడర్ షాకులిస్తోంది. ఒకరి తర్వాత ఒకరు పార్టీకి వీడ్కోలు పలికేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ వంశీకృష్ణ రాజీనామా చేసి, జనసేనలో చేరారు. మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, కొందరు కార్పొరేటర్లు కూడా రాజీనామా చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఇటీవల ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి వైసీపీ నుంచి పోటీచేసి ఓటమి పాలైన సీతం రాజు సుధాకర్ శుక్రవారం తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పంపారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పరిణామాలపై తీవ్ర మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సుధాకర్ విశాఖ దక్షిణ నియోజకవర్గం టికెట్‌ను ఆశిస్తున్నారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా సుధాకర్‌కు అనుకూలంగా కొందరు కార్పొరేటర్లు ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో సుధాకరే తమ అభ్యర్థి అని, ఆయనను గెలిపిస్తామని వారు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీతంరాజు సుధాకర్ రాజీనామా చేయడంతో స్థానికంగా గందరగోళం నెలకొంది.

సంపాదకీయం

న్యాయబద్ధమైన ఎన్నికలు జరిగేనా?

వచ్చే ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలకు యుద్ధప్రాతిపదికన సిద్ధమవుతున్నట్లు ఇటీవలనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధిబృందం వెల్లడించింది. నాలుగు నెలల సమయముందని సూచనప్రాయంగానే చెప్పినప్పటికీ, కేంద్ర రాష్ట్రాల్లో పాలకపార్టీల హడావిడి చూస్తుంటే ఏప్రిల్ నెల 'ఎన్నికల మాసం'గా ఖరారయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగినట్లు చెప్పుకోవచ్చేమోగానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరుగుతాయంటే అనుమానమే. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 400 సీట్లలో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు పన్నుతోంది. అందులో ప్రధాన వ్యూహం, ఆశ ఈవీఎంలే. ఎప్పటిలాగానే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై గంపెడాశతో మోదీ సర్కారు పావులు కదుపుతోంది. ఈవీఎంలను తక్షణం చక్కదిద్దకపోతే, ఎన్‌డీఏకు కచ్చితంగా 400 సీట్లు వస్తాయని రాజకీయ, సాంకేతిక నిపుణులు ఢంకా బజాయించి చెపుతున్నారు. ఈ మధ్యనే జరిగిన 'ఇండియా' కూటమి సమావేశంలోనూ ఇదే అంశంపై తీవ్రమైన చర్చ నడిచింది. సెమీఫైనల్స్‌గా చెప్పుకున్న ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఊహించనివిధంగా మూడు రాష్ట్రాల్లో జయభేరి మోగించింది. ముఖ్యంగా మధ్యప్రదేశ్ ఫలితం అనూహ్యం. ఓడిన పార్టీ ఏదైనా, పరాజయానికి ఈవీఎంలపైనే నిందలు వేస్తుంది. గతంలో కాంగ్రెస్ గెలిచినప్పుడు బీజేపీ కూడా నిందలు వేసింది. ఏకంగా పుస్తకాలే ప్రచురించింది. పార్టీలకతీతంగా సాంకేతిక నిపుణులే ఈవీఎంల 'సమర్థత'పై సందేహాలు వెలిబుచ్చారు. నూటికి నూరు శాతం ఈవీఎం ఫలితాలు అక్రమమని నిరూపించే ప్రయత్నం చేశారు. సాంకేతిక పరికరాలను మనకు అనుకూలంగా అలవోకగా మార్చుకోవచ్చన్నది జగద్విదితం. అధికారంలో ఉన్న పార్టీ 'కుర్చీ' కోసం అలాంటి పనిని సులువుగా చేసేస్తుంది. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై బీజేపీపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా వాస్తవమే. అలాగని ఆధునిక భారతంలో తిరిగి బ్యాలెట్ పత్రాలను తీసుకురావడమనేది సాధ్యం కాకపోవచ్చు. కానీ ఈవీఎంలను సరిచేయడం అసాధ్యమేమీకాదు. చాలామంది నిపుణులు గత ఏడెనిమిదేళ్లుగా సూచనలు చేస్తున్న సందర్భాలు కోకొల్లలు. అయినా కేంద్ర ఎన్నికల సంఘానికి పట్టదు. మోదీ జేబు సంస్థలుగా మారిపోయిన రాజ్యాంగబద్ధ సంస్థల్లో ఎన్నికల సంఘమూ ఒకటి. పైగా పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రతిపక్ష రహిత మూజువాణి ఓటింగ్‌లో సరికొత్త సీఈసీ, ఈసీ బిల్లులకు ఎన్‌డీఏ ప్రభుత్వం ఆమోదముద్ర వేయించుకుంది. వాటిని చదవాల్సిన పనిలేకుండానే రాష్ట్రపతి ముద్ర వేసి ఉండవచ్చు. కొత్త బిల్లులతో దాదాపు స్వతంత్రతను కోల్పోయిన ఎన్నికల సంఘం 2024 సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, న్యాయబద్ధంగా నిర్వహిస్తుందని ఇసుమంతైనా ఆశించలేం. సార్వత్రిక ఎన్నికలతోపాటు జరిగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల గోలను ఇంకో కోణంలో చూడాల్సి ఉంటుంది. ఏపీలో చట్టబద్ధమైన ఎన్నికల ప్రక్రియకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఓటర్ల నమోదు ప్రక్రియ కనీవినీ ఎరుగని రీతిలో దేశంలోనే కలకలం రేపింది. దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలు, అక్రమ జాబితాల విషయంలో ఏపీ చరిత్ర సృష్టించింది. దొంగ ఓట్ల నమోదు చేయించేందుకు రెండు ప్రధాన పార్టీలు ఏకంగా ప్రత్యేక విభాగాలనే ఏర్పాటు చేశాయి. అందులో పాలక వైసీపీ రెండాకులు ఎక్కువే తిన్నది. ఇష్టానుసారంగా దొంగ ఓట్లను నమోదు చేయించింది. ప్రజాస్వామ్య వ్యవస్థకే ఇది మాయనిమచ్చ. పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించడం ఎన్నికల సంఘం విధి. అది జరుగుతుందని ఆశించడమంటే మన చెప్పుతో మనమే కొట్టుకోవాలి. ఏపీలో ఓటరు చేర్పింపుల రచ్చ ఎంతటి సిగ్గుచేటంటే, ఓటర్ల చేర్పింపులో గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు దండిగా పాల్గొని, ఇబ్బడిముబ్బడిగా అక్రమ జాబితాను పెంచేసి, ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేశారు. కేవలం 11 నెలల వ్యవధిలో క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై 90 లక్షలకు పైగా దరఖాస్తులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందాయి. రాష్ట్ర సీఈఓ ముఖేశ్‌కుమార్ మీనాయే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. అందులో 89 లక్షల దరఖాస్తులు పరిష్కరించామని చెప్పుకొచ్చారు. ఇంకా లక్ష అభ్యంతరాలు పెండింగ్‌లో ఉన్నాయి. మృతులు, డబుల్ ఎంట్రీలు లెక్కలేనన్ని ఉన్నాయని అధికారిక లెక్కలే నిర్ధారిస్తున్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు ఏనాడూ, ఏ రాష్ట్రం నుంచీ రాలేదని సీఈసీ బృందం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అయితే, రికార్డు స్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తినా, ఇప్పటివరకు ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు పరిష్కారమవుతాయంటే విశ్వసించగలమా?

ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితా తయారీలో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ ప్రశ్నించడంతో లోక్‌సభలోనూ చర్చ జరిగింది. జాబితాలో సవరణ కోసం ఇంకా 23 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ పరీక్షించిన తర్వాతనే తుది జాబితా వెలువరించాలని లోక్‌సభ సభ్యులు కోరిన అంశం ప్రస్తావనార్హం. ఓటర్ల జాబితా పరిశీలనకు రాష్ట్ర అధికారులను వినియోగించడం వృథాప్రయాసే అవుతుంది. ఇతర రాష్ట్రాల ఎన్నికల పరిశీలకులను రంగంలోకి దించాల్సిన అవసరం ఉంది. చట్టవిరుద్ధంగా పేర్లను తొలగించడం ప్రధానంగా వివాదాస్పదమైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలోని లోటుపాట్లను సరిదిద్దడానికి పంపిన స్థానిక అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వాటిని సరిదిద్దే బాధ్యతను కిందిస్థాయి సిబ్బందిపైకి నెట్టేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను పట్టించుకోవడం లేదని క్షేత్రస్థాయి పరిశీలనలో రుజువైంది. స్థానికేతర పరిశీలక బృందంతో జాబితాను ప్రక్షాళన చేయకపోతే, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదు. దోషరహిత ఓటర్ల జాబితాతోనే వివాద రహిత ఎన్నికలకు ఆస్కారముంటుంది. ఇంకోవైపు, రాజకీయ పార్టీలతో సఖ్యతగా ఉండాలని, పక్షపాతం చూపిస్తే శిక్ష తప్పదని ఈసీఐ హెచ్చరించినా రాష్ట్ర అధికారుల్లో చలనం లేకపోవడం విచారకరం. ఏపీలో ఈసారి స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ అనేది అతిపెద్ద సవాల్‌గా మారుతుందని మాజీ ఎన్నికల అధికారులు సైతం ఆందోళన వెలిబుచ్చడం సమంజసమే. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియలోకి రామ్ ఇన్ఫోటెక్, ఐప్యాక్ వంటి కార్పొరేట్ సంస్థలు చొరబడి, వ్యక్తుల సమాచారాన్ని అనైతికంగా సంపాదించి, 'మనవాళ్లు ఎవరు? కానివాళ్లు ఎవరు?' అంటూ జాబితాలు తయారు చేయడం, ఓటర్లను ప్రభావితం చేసేవారి వివరాలను సేకరించి, వారిని ప్రలోభపెట్టడం పారదర్శక ఎన్నికల నిర్వహణకు విఘాతం. ప్రభుత్వమే ఈ సంస్థలకు కోట్లాది రూపాయలు ముట్టచెపుతున్నది. ఈ విషయంలో ఈసీ క్రియాశీలంగా వ్యవహరిస్తుందా అనేది సందేహాస్పదమే. అదే సమయంలో ఈవీఎంలపై పెరిగిన అపనమ్మకాన్ని తొలగించే క్రమంలో సీఈసీ దృష్టిపెట్టాలి. ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెయిల్ (వీవీప్యాట్) స్లిప్‌లలో రికార్డయిన ఓట్లు, ఈవీఎంలలో లెక్కింపు సరిచూసిన తర్వాతనే ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తే కొంతమేరకు న్యాయం జరుగుతుంది. ఈ రెండింటి మధ్య ఏదైనా వ్యత్యాసముంటే ఎన్నికల నిర్వహణ నిబంధన 56డి(4)(డి) ప్రకారం వీవీప్యాట్ స్లిప్‌లలో నమోదైన ఓట్ల సంఖ్యే సక్రమమైనదిగా పరిగణించి తీరాలని నిపుణుల అభిప్రాయం. ఈ ప్రక్రియ వల్ల జాప్యం జరగవచ్చేమోగానీ, న్యాయం జరుగుతుంది. కాకపోతే ఎన్నికల సంఘానికి ఈ సూచనను స్వీకరించే దమ్ముందా?



ఉదయపు ఉమ్మెత్త పువ్వు పతంజలి శాస్త్రి

"మాటి మాటికి చదువు, చదువు అంటావు. ఏముందిరా చదువులో" అన్నాడు నా చిన్ననాటి మిత్రుడు. నేనేం చెప్పలేదు. గేదె మీద ఠీవిగా నిలుచున్న పిట్టని చూపించా. "దాన్ని చూస్తే నీకెమనిపిస్తోంది" అని అడిగా. "ఏముంది... గేదె మీద పిట్ట" అన్నాడు. నీకంతే అనిపించింది. అదే చదువుకుంటే గేదె మీద పిట్ట అని నవలిక రాయగలవు. రాయడం కాదులే... కనీసం ఆ పిట్ట దృశ్యాన్ని చూసే చూపులోనే మార్పు ఉంటుంది. సృజన అంటే ఏం కాదు. కొత్త చూపు కలిగి ఉండడమే. అలాంటి చూపు ఉండి.... కాసింత చదువు ఉంటే సాహిత్య సృజన చేయడం ఏమంత కష్టం కాదు. తెలుగు సాహిత్యంలో

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

అలాంటి చూపు, ఆ చూపు నుంచి వచ్చిన సాహిత్యమే చిరకాలం నిలబడింది. నిలబడుతుంది. నిలబెడుతుంది. అలా నిలబడి, నిలబెట్టి, నిన్ను, నీ జీవితాన్ని లోపలికంటా పరికించి చూసేలా కథలు రాసినాయనే తల్లావఝల పతంజలి శాస్త్రిగారు. ఈ గోదారి ఉంది చూశారూ.. అది అలా పారుతూ వెళ్లిపోదు. మధ్యలో ఇదిగో తన మజిలిలో ఓ ఒడ్డున పతంజలి శాస్త్రి ఉన్నాడు. అతడ్ని పలకరించి వెళ్లిపోదామని ఆగుతుంది. అదిగో ఆ గోదావరే ఆయన గుండెల్లో చేరి కొలువు తీరుతుంది. అలా అలా గుండెల్లోంచి జలపాతంలా జారుతూ అప్పుడో, ఇప్పుడో గుప్పెడు అక్షరాల్లా కాగితాల మీద ఒలికిపోతుంది. దానికే మనం గుండె గోదారి అని పేరు పెట్టుకుని కడుపున పుట్టిన వారిని ఒళ్లో కూర్చోపెట్టుకుని కబుర్లు చెబుతున్నట్లుగా, బెంగటిల్లిన జీవితానికి సేద తీర్చుకుందుకు అమ్మ ఒడిలో నిద్రపోయినట్లుగా ఆ అక్షరాల్లో సేద తీరుతాం. ఒంటరి సమూహం మధ్య ఒక్కరే పతంజలి శాస్త్రి అనిపిస్తుంది ఆయన్ని చూస్తే. ఓ అరగంట ఆయన మాట్లాడిన తర్వాత... నువ్వు కాదు... ఆయన మాట్లాడిన తర్వాత మనమే ఒంటరి... ఆయన ఓ సమూహం అనిపిస్తుంది. అలా నీకు అనిపించకపోతే ఆ క్షణానికి ముందు నువ్వు బతికినదంతా వెనక్కి తిరిగిన పాదాలతోనే అని ఎరుక కలుగుతుంది. పతంజలి శాస్త్రి గారు బహు ముఖాలు కలిగిన ఏక రూపి. ఆ అనేకానేక రూపాలలోనే నిన్ను, నన్ను, తండ్రిని, ఓ దొంగని, రామేశ్వరం కాకుల్ని, పిట్టల్ని, పురుగుల్ని, నీటిని, గాలిని, ఈ రెంటిని నాశనంచేస్తున్న దురాశలని చూస్తారు. అన్నీ చూసిన తర్వాత ఆ కళ్లు నిద్రలేమితో కాదు... ఓ సంక్షుభిత సమాజం ముందు అక్షరాలై పూస్తాయి. అవి చదివాక ఇక నిద్రలేమి నీదే అవుతుంది. అతను ఆమె నుంచి విడివడాలనుకుంటాడు. ఆమె అతనికి దూరంగా ఉండాలనుకుంటుంది. నువ్వు బయట ఉంటావు కదా... వాళ్లిద్దరు కలిసుండాలనుకుంటావు. పతంజలి శాస్త్రిగారంటారూ "మార్కండేయులు ఎలా ఉండాలనుకున్నాడో అలాగే ఉన్నాడు... పూర్ణ ఎలా ఉండకూడదనుకుందో అలాగే ఉంది". ఇది చదివిన మనం ఎలా ఉన్నాం. ఎలా ఉంటాం. ఓ సముద్రం మనలో తుపాను సృష్టిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటాం. ఇలా రాయాలని, ఇలా బతకాలని, ఇలా ఎదగాలని ఏ రాజ్యాంగం ఉండదు రుషులకి. అలా బతికేస్తారంతే. వాళ్లు కూడా రుషుల్లాగో, పైనుంచి వచ్చిన దేవతల్లాగో తలచరు. అలా బతికేస్తారంతే. కాకపోతే మనలో అలజడులు సృష్టిస్తూ, ప్రశ్నలు పుట్టిస్తూ, జవాబులకోసం వెతుకులాడే వారిగా మిగిలిపోతాం. అందుకేనేమో... తిలక్, త్రిపుర, ఇస్మాయిల్, వేగుంట, ఇదిగో ఈ పతంజలి శాస్త్రిగారు మనతో తిని, నిద్రించి, స్నానించి, స్వప్నించి తెల్లారగానే ఉమ్మెత్త పువ్వులా వికసిస్తారు. చూసిందంతా నిజమనుకుని, రాసిందంతా బాగుందనుకుని మిగిలిన ప్రపంచంతో సంబంధం లేకుండా బతికేస్తున్న సమాజం ఇది. కొల్లేరు సరస్సు క్యాచ్మెంట్ ఏరియాని ఎవరు పరిరక్షించాలి. అడవుల నరికివేతను ఎవరు అడ్డుకోవాలి, ప్రకృతి ధర్మానికి వ్యతిరేకంగా జరుగుతున్న విపరిణామాలను ఎలా నివారించాలి. వీటికి సంతాపం తెలిపేలా ఓ పద్యం రాస్తే చాలా. లేదూ ఓ కథో, నవలో, వ్యాసమో రాసి తృప్తిగా త్రేన్చి సుఖ నిద్ర అనుకుంటున్న భవిష్యత్ మరణశయ్యపై కునుకుతీస్తే సరిపోతుందా. కాదంటున్నారు పతంజలి శాస్త్రి గారు. కావాలంటే ఆనాడెప్పుడో ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేసిన కాగితాలు ఆయన మంచం పక్కనే ఉన్నాయి. కాసింత చదవండి ఈ లోక హితైషి గురించి తెలుస్తుంది. సాహిత్య అకాడెమీ దశాబ్దంన్నర తర్వాత కొత్తగా పురుడు పోసుకుని పతంజలి శాస్త్రి కనుగొంది. అన్నట్లు కనలేదు... కనుగొంది. ఇదీయూ సూనృతమే. ఓ ఇంటర్వ్యూలో అన్నారాయన "నా కథల్లో మనుషులు రచయిత సహాయంతో నడవరు" అని. అవును. ఈ సాహిత్య అకాడెమీ అవార్డు కూడా రచనల్లో మనుషుల్లా ఎవరి సహాయం తీసుకోలేదు.

సీనియర్ జర్నలిస్టు, 99120 19920

తాకట్టులో భారత దేశం

చలసాని వెంకటరామారావు

145 కోట్ల జనాభాతో భారత దేశం చైనాను జనాభాలో అధిగమించి ప్రపంచంలోనే అగ్ర స్థానంలో ఉంది. 29 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలతో అతి పెద్ద స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యం మనది. అణ్వస్త్రాలతో పాటు తగినంత సైనిక సామర్థ్యం ఉంది. అపార ప్రాకృతిక వనరులతో కూడిన వేలాది కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. సింధూలోయ నాగరికతకు, హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మతాలకు భారత్ పుట్టినిల్లు. ముస్లిం, క్రైస్తవ మతాలకు మంచి ఆదరణ ఉంది. వివిధ రకాల వన్య ప్రాణులతో వైవిధ్యంతో కూడిన 23 శాతం అటవీ ప్రాంతం ఉంది. అతి పెద్ద వాణిజ్య నగరం ముంబై దేశానికే తలమానికంగా ఉంది. దేశంలో 83 కోట్ల ఎకరాల సాగుభూమి ఉంది. అందులో 44 కోట్ల ఎకరాలు సారవంతమైన మాగాణి భూమి ఉంది. 70 కోట్ల మంది వ్యవసాయం ఆధారంగా జీవిస్తున్నారు. 30 జీవనదులు ఈ భూమిని సస్యశ్యామలం చేస్తున్నాయి. పాడి పంటలకు కొదవలేదు. 40 కోట్ల మంది శ్రామిక జనులు నిత్యం ఉత్పత్తి ప్రక్రియలో భాగస్వామ్యం వహిస్తున్నారు. 45లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దేశంలో ఉన్నాయి. కోట్లమంది అసంఘటిత కార్మికులు, స్వయం ఉపాధి కార్మికులు ప్రభుత్వంతో పనిలేకుండా జీవిస్తున్నారు. 8 కోట్లమంది వలస కార్మికులు ఎక్కడ పని ఉంటే అక్కడకు వెళ్లి పనిచేసుకుంటున్నారు. భారత దేశం అంతర్జాతీయంగా ఎంతో కీర్తి ప్రతిష్ఠలు సంతరించుకుంది. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ వాణిజ్య సంస్థ, బ్రిక్స్, సార్క్, 2-4, గ్రూప్ ఆఫ్-5, జి-20, కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్ వంటి సంస్థలలో భాగస్వామ్యం వహిస్తున్నది. "అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉంది" అన్నట్లు ఇన్ని అవకాశాలు ఉన్నా పేదరికం, నిరక్షరాస్యత, అవినీతి, పోషకాహార లోపం వంటి సవాళ్లు దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. జనాభాలో సుమారు 25 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారు. భారతదేశం స్వాతంత్ర్యం పొంది 76 ఏళ్లు దాటింది. ఈ కాలంలో పాలకులు అనుసరించిన విధానాల వల్ల దేశం ఆర్థిక రంగంలో స్వావలంబనను సాధించటంలో విఫలం అయింది. దీని ఫలితంగా ఏటికి ఏడు దేశం అప్పుల కుప్పగా మారిపోయింది. చివరికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలనలో ఇండియా అప్పులకు కేరాఫ్ అడ్రసుగా మారిపోయింది. ప్రపంచ ఆర్థిక సూచీలో సుదీర్ఘ కాలం భారత్ అగ్రస్థానంలో ఉంది. టెక్స్‌టైల్, సిల్క్ జూట్, పంచదార, పాడిపరిశ్రమలలో అగ్రస్థానంలో ఉంది. ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధిపత్యానికి ముందు భారత్ ఎగుమతుల దేశంగా ఉంది. కానీ తరువాత దిగుమతుల దేశంగా మారిపోయింది. స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికాభివృద్ధిలో వెనుకబాటు వల్ల అభివృద్ధి మందగించింది. సోవియట్ యూనియన్ అనుసరించిన ప్రణాళికాబద్ధ ఆర్థికవిధానాన్ని అనుసరించి పంచవర్ష ప్రణాళికల ద్వారా దేశాభివృద్ధికి నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అవిరళ కృషి చేశారు. ఫలితంగా దేశం అనేక రంగాలలో అభివృద్ధి సాధించింది. అయినా దేశ మౌలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఆర్థిక అసమతుల్యత కొనసాగుతూనే ఉంది.

గత 10 ఏళ్ల కాలంలో ఈ అపసవ్య ఆర్థిక విధానాల ఫలితంగా దేశ ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారి భారతదేశం ఒక "రుణగ్రస్థ భారత దేశం"గా మారిపోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు 55 లక్షల 87 వేల 149 కోట్ల రూపాయల రుణాలు దేశానికి ఉంటే నరేంద్రమోదీ ప్రధాన మంత్రిగా ఉన్న తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలో 100 లక్షల కోట్లకు పైగా అప్పులు చేయటంతో దేశ అప్పుల ఖాతా 155 లక్షల కోట్లకు చేరుకుంది. దీనికితోడు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగి ప్రభుత్వానికి లక్షల కోట్ల ఆదాయం రాగా, సామాన్యుల నడ్డి విరిగే విధంగా ధరల భారం భరించాల్సి వచ్చింది. గత ప్రభుత్వాలు చేసిన అప్పులు తీర్చటానికి అప్పులు చేశాం అని చెబుతున్న పాలకుల మాటలకు, ఆదాయ వ్యయ లెక్కలకు పొంతన కుదరటం లేదు. 5 లక్షల కోట్లతో 18 మెగా ప్రాజెక్టులు ప్రతిపాదించిన ప్రభుత్వం ఆ ప్రాజెక్టుల నిర్మాణానికి ఒక తట్టెడు మట్టి కూడా వేయలేదు. సగటున సంవత్సరానికి 10 లక్షల కోట్లకు పైగా ప్రభుత్వం అప్పులు చేసింది. ఈ ఏడాది అంతానికి మొత్తం దేశం అప్పులు లక్షన్నర కోట్లకు చేరుకుంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది ఆర్థిక రంగంలో తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఇదే కాలంలో జీఎస్టీ వసూళ్లు బాగా పెరిగింది. నెలకు 1 లక్షా 70 వేల కోట్ల వరకు వసూళ్లు జరుగుతున్నాయి. ఇతర పన్నులు, సెస్సులు వసూలు చేస్తున్నారు. అయినా అప్పులభారం తప్పటంలేదు. దేశ అప్పులు ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు తగ్గరీతిలో మాత్రమే ఉండాలి. మన వార్షిక బడ్జెట్‌కు మూడింతలు అప్పులు ఉంటే భరించటం కష్టమౌతుంది. ఈ అప్పులకు 6.9 శాతం వడ్డీ చెల్లించాలి. రిస్క్ ఉంటే వడ్డీ మరింత ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. మన ఎగుమతుల ' రేటింగ్ బాగుంటే తక్కువ వడ్డీకి రుణ పరపతి' ఉంటుంది. దిగుమతులు ఎక్కువైతే వడ్డీరేటు కూడా పెరుగుతుంది. "అప్పుచేసి పప్పుకూడు తింటే" భారత్ శ్రీలంకలా మారిపోతుంది. అప్పుల ద్వారా వచ్చే ఆదాయాన్ని మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి, ఉత్పాదక రంగాలకు ఖర్చు చేయాలి. లేకపోతే తీవ్ర సంక్షోభంలో ఆర్థిక వ్యవస్థ కూరుకుపోతుంది. రష్య, ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిన విషయం పరిగణలోకి తీసుకుని భారత ప్రభుత్వం జాగ్రత్త పడాలి. ఇప్పటికీ 10 ఏళ్లలో అంతకు ముందు ఉన్న అప్పుల భారం కంటే మూడు రెట్లు అధిక భారం దేశం మీద, ప్రజల మీద పడుతున్నది.

గత 10 ఏళ్ల కాలంగా దేశ పారిశ్రామికాభివృద్ధి మందగమనంతో ఉంది. దేశ స్థూల దేశీయోత్పత్తి పెరిగినప్పటికి ఇది అభివృద్ధికి సూచిక కాదు. ఉపాధిలో 94శాతం ఉన్న అసంఘటిత రంగాన్ని జీడీపీ గణాంకాలలో లెక్కలోకి తీసుకోనందున ఇది అభివృద్ధిగా కన్పిస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మనం 5వ స్థానానికి వచ్చాం. కొద్ది సంవత్సరాలలో 3వస్థానం చేరుకుంటామనే అంచనా ఉంది. కానీ పెరుగుతున్న జనాభా కారణంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి కన్పిస్తుంది. దేశంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను, జీఎస్టీ, కార్పొరేట్ టాక్స్, ఎక్సైజ్ రెవెన్యూ, కస్టమ్స్ డ్యూటీ ద్వారా లక్షల కోట్లు ఆర్జిస్తున్నాం. వీటికి తోడు భారత -రైల్వేలు, బొగ్గు గనులు, ప్రత్యక్ష, పరోక్ష పన్నులు ద్వారా లక్షల కోట్ల ఆదాయం వస్తున్నది. దీనికి అదనంగా రాష్ట్రాలు మరో 76 లక్షల 09 వేల 926 కోట్లు అప్పులు చేశాయి. దేశ జీడీపీలో 40 శాతానికి మించి ఏదేశం అప్పులు చేయరాదు. కానీ భారత్ 43 శాతం అప్పులు చేసింది. ఇది మరింత పెరిగితే సంక్షోభం తప్పదు. చేసిన అప్పులు షరతుల మేరకు ప్రతి సంవత్సరం తిరిగి చెల్లించాలి. అప్పులకు వడ్డీలు చెల్లించాలి. ఇది ప్రజలకు రానున్న రోజుల్లో భారంగా పరిగణిస్తుంది. ఆదాయానికి మించిన ఖర్చు దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంది. ఆదాయం 100 ఉంటే ఖర్చు 103కు మించరాదు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటివి అప్పులు ఇస్తాయి. వీటికి తోడు ప్రపంచ గుత్త కుబేరులు వివిధ దేశాలుకు అప్పులు ఇస్తారు. అప్పులకు అనేక షరతులు విధిస్తారు. ఈ షరతుల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు అథమ స్థాయికి నెట్టి వేయబడతాయి. దీనికి తోడు పాలకులు అనుసరించిన విద్వేష పూరిత రాజకీయాలు ఆర్థిక వ్యవస్థను అస్థిర పరచాయి. అప్పులు చేసిన డబ్బులు ఏం చేశారో లెక్కలు చెప్పరు. రిజర్వు బ్యాంకు నిల్వ 7లక్షల కోట్లు ఉంటే, లక్షల కోట్ల ప్రభుత్వ ఖజానాకు మళ్లించిన కేంద్ర ప్రభుత్వం వలస కార్మికులకు, కరోనా వల్ల ఆర్థిక అస్థిరతకు గురైన, ఉపాధి కోల్పోయిన ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. 9 ఏళ్లలో 15 లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ బకాయిలను రద్దు చేశారు. కేవలం 5 ఏళ్లలో ఉద్దేశ పూర్వక ఎగవేతదారుల బ్యాంకుల బకాయిల రద్దుకు 10 లక్షల కోట్ల రూపాయలకు పైగా వినియోగించారు. విజయ్ మాల్యా, నీరవ్ మోది, మోహల్ చోక్సీ, లలిత్ మోదీ, సంజయ్ బండారి, దీపక్ తల్వార్ లాంటి మోసగాళ్లకు రక్షణగా కేంద్రప్రభుత్వం నిలిచింది. 'దేశ అభివృద్ధి, ఆర్థిక రంగ పురోగతిలో కీలక భూమిక వహిస్తున్న ప్రజల సంపదతో కూడ బెట్టిన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మివేసి ఆ డబ్బును మోసగాళ్లయిన కార్పొరేట్ దొంగలపాలు చేస్తున్నారు. తాను ప్రజా సంపదను పరులకు కట్టబెట్టి, విచ్చలవిడిగా అప్పులు చేస్తూ రాష్ట్రాలకు మాత్రం అప్పులు చేయవద్దని నీతులు చెబుతున్నారు. దేశంలో ఉన్న చదువుకున్న యువకులు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక విదేశాలకు ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో వలసలు పోతున్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఉచిత పథకాలను తీసుకువచ్చి లక్షల కోట్ల రూపాయల భారాన్ని ప్రజల మీద వేస్తున్నారు. 2027 నాటికి మూడవ ఆర్థిక వ్యవస్థగా భారత దేశం వెలుగులు ప్రసరిస్తుందని నమ్మ బలుకుతున్నారు. సుసంపన్నమైన, బహువిధమైన, వైవిధ్య భరితమైన దేశంగా భారత్ వెలుగొందాలంటే తాకట్టులో ఉన్న భారత దేశాన్ని విముక్త భారత్‌గా రూపొందించాలి. అమృతకాల కలలకు రూపకల్పన చేసే ఆర్థిక విధానాలు రూపొందించాలి. అందుకు అనుగుణంగా రాజకీయ రంగంలో మార్పులు జరగాలి.

ఫోన్: 9490952093

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

ఎర్రసముద్రానికి మారిన యుద్ధం

డాక్టర్ కొల్లా రాజమోహన్

హమాస్ 2023 అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై దాడి చేసిన తరువాత గాజాపై ఇజ్రాయిల్ ప్రతీకార బాంబు దాడులతో యుద్ధం మరింత వికృతరూపం ధరించింది. ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని కార్పెట్ బాంబు దాడులను సాగిస్తోంది. కొరియా, వియత్నాం యుద్ధాలలో ఒక్క అంగుళం కూడా వదలకుండా కార్పెట్ బాంబు దాడులనుచేసి అమెరికా మారణ హోమాన్ని సృష్టించింది. అదే చరిత్రను పునరావృత్తం చేస్తూ, ఇజ్రాయిల్ సైన్యం విరామంలేకుండా బాంబు దాడులు చేస్తూ, గాజాలో ఇళ్లను భూమట్టం చేస్తూ శ్మశానానందాన్ని పొందుతోంది. 21 వేలమందికి పైగా సామాన్య అమాయక పలస్తీనియన్లను హతమార్చింది. ఇందులో 70 శాతం మంది చిన్న పిల్లలు, మహిళలతోపాటుగా జర్నలిస్టులు, డాక్టర్లు కూడా వున్నారు. తీవ్ర అననుకూల పరిస్థితులలో వార్తలను సేకరిస్తూ, సంఘర్షణలను, బాంబుదాడులను చిత్రీకరిస్తూ 90 మంది జర్నలిస్టులు తమ ప్రాణాలనర్పించారు. హ్యూమన్ రైట్స్ వాచ్ గత వారం ఇజ్రాయిల్ ప్రభుత్వం యుద్ధ నేరానికి పాల్పడిందని విమర్శించింది. ప్రజలకు ఆహారం, నీరు అందకుండా కృత్రిమ కరువును సృష్టించి ప్రజల ప్రాణాలను తీస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూని ఈనాటి హిట్లర్ అని టర్కీ అధ్యక్షుడు ఎర్దొగాన్ పేర్కొన్నాడు. "గాజాపై ఇజ్రాయిల్ ఉన్మాద దాడులను వెంటనే ఆపాలి" అన్నారు. పలస్తీనా ప్రజలకు అండగా మేమున్నామంటూ, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజా ప్రదర్శనను ఇస్తాంబుల్ పట్టణంలో నిర్వహించారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మాట్లాడుతూ, మలేసియా ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికా ఒత్తిడులకు లొంగబోమన్నారు. తమ హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న పలస్తీనియన్లకు పూర్తి సహకారం అందిస్తామని పెద్దఎత్తున ప్రజా ప్రదర్శనను నిర్వహించారు. కొలంబియా అధ్యక్షుడు పెట్రో, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోస్ , అమెరికా, జర్మనీ, బ్రిటన్ ప్రజలు గాజా ప్రజలకు అండగా వుంటామన్నారు.

మానవ కల్పిత కరువు

గాజాలోని పలస్తీనియన్లకు అవసరమయిన ఆహారంలో కేవలం 10 శాతం మాత్రమే అందుతున్నదని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు,ఎన్‌జీఓలు, సహాయ సంస్థల భాగస్వామ్యం అయిన ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ ప్రచురించిన తాజా

నివేదికలో, గాజాలో ఉన్న కుటుంబాలు, ఆకలి సంక్షోభంతో తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. గాజాలోని మొత్తం 23 లక్షల జనాభా అతిపెద్ద మానవ కల్పిత కరువు ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని హెచ్చరించింది. తక్షణ కాల్పుల విరమణ కోసం ఐరాస పిలుపునిచ్చేందుకు వీల్లేదని అమెరికా వీటోని ప్రయోగించి తన సామ్రాజ్యవాద స్వభావాన్ని మరోసారి నిరూపించుకున్నది. గాజాలో మానవతావాద పరిస్థితి భయంకరంగా మారడం, ఇజ్రాయిల్ సైనిక చర్య సమర్థించలేనిదిగా మారడంతో, టెల్ అవీవ్ బలమైన మద్దతుదారులయిన అమెరికా, జర్మనీ, బ్రిటన్ లలోకూడా ప్రజలు తిరగబడుతున్నారు. ప్రభుత్వాలు ఇరుకున పడుతున్నాయి.ఎర్ర సముద్రంలోని "ఇజ్రాయిల్-లింక్డ్" నౌకలపై యెమెన్ హౌతీ మిలీషియా దాడులను తీవ్రతరం చేయడంతో వివాదం మధ్యప్రాచ్యంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తోంది.

సముద్రానికి మారిన యుద్ధం

పలస్తీనాకు మద్దతిస్తున్న హౌతీ రెబెల్స్ ఎర్రసముద్రాన్ని(రెడ్ సీ) యుద్ధ క్షేత్రంగా మార్చుకుని ఇజ్రాయిల్‌తో సంబంధమున్న దేశాల నౌకలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులను చేస్తున్నారు. ప్రపంచ వాణిజ్య రంగంలో ముఖ్యమైన నౌకా రవాణా రంగంలో అత్యంత కీలకమైన మార్గం ఎర్రసముద్ర నౌకా మార్గం. ఈ మార్గం ద్వారానే అమెరికా, ఐరోపా దేశాలు ఆసియా, ఆఫ్రికా దేశాలతో వ్యాపారం చేసి లాభాలను ఆర్జిస్తున్నాయి. ఆఫ్రికా చుట్టూ తిరిగిరాకుండా ఈజిప్ట్‌లోని సూయజ్ కాలువ-ఎర్రసముద్రం మీదుగా అంతర్జాతీయ వాణిజ్యం సాగుతోంది. బాబ్ ఎల్ మండెబ్ జలసంధి వద్ద మార్గం చాలా సన్నంగా 29 కి.మీ. మాత్రమే వుండటం వలన సముద్ర నౌకలపై దాడులకు అనువుగా వుంది. దగ్గరలో వున్న ఎమెన్‌ను స్థావరంగా చేసుకుని హౌతీ రెబెల్స్ వాణిజ్య నౌకలపై దాడుల ద్వారా, అంతర్జాతీయ వాణిజ్య సమాజాన్ని గాజాలో మారణహోమాన్ని ఆపమని కోరుతున్నారు. మొత్తం అంతర్జాతీయ సమాజానికి అల్టిమేటం ఇస్తున్నారు. అమెరికా నేతృత్వంలోని 10 దేశాల మిలిటరీ బలగాలను ఎర్రసముద్రంలోకి దించి హౌతీలను ఎదుర్కోవాలని అమెరికా "ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్" వ్యూహాలను రచిస్తున్నది. యుద్ధ నౌకల పహారాతో సముద్ర నౌకలను దాడుల నుంచి రక్షించటానికి ఎర్రసముద్ర (రెడ్ సీ) సంకీర్ణ రక్షణ కూటమిని అమెరికా ఏర్పాటు చేసింది. ఈ కూటమిలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, బహరైన్, సేచెల్స్, స్పెయిన్, నార్వే, నెదర్లాండ్, కెనడా, ఇటలీతో 10 దేశాలున్నాయి. ప్రాంతీయ దేశాలలో బలమైన సౌదీ అరేబియా, ఈజిప్టు చేరలేదు. ఒక్క బహ్రైన్ దేశం ఈ కూటమిలో చేరింది. బహ్రైన్ జనాభా, వైశాల్యం, సైనిక శక్తిలోకూడా చిన్న దేశమే. కూటమిలో చేరటానికి అన్ని నాటో దేశాలు ఉత్సాహం చూపటంలేదు. గాజాపై దాడులు ఆపకపోతే ప్రపంచ ఇంటర్నెట్‌పై కూడా దాడి చేస్తామని హౌతీలు హెచ్చరించారు. బాబ్ ఎల్ మండెబ్ జలసంధికి దగ్గర సముద్ర భూగర్భ జలాలోనుంచి వెళ్తున్న సముద్ర కేబుల్ నెట్‌వర్క్ వైర్‌లను కత్తిరించేస్తామన్నారు. ప్రపంచంలో వున్న ఇంటర్నెట్ డేటా 99 శాతం సబ్ మెరైన్ కేబుల్స్ ద్వారానే జరుగుతుంది. హౌతీలు కొత్తగా నౌకల పైననే కాకుండా, ప్రత్యక్షంగా అమెరికా యుద్ధ నౌకలపైనా, ఇజ్రాయిల్ పోర్టులపై కూడా దాడులను మొదలెట్టారు. అమెరికా యుద్ధ నౌకలు హౌతీల క్షిపణి దాడులను ఆపలేకపోయాయి. వందలకొలదీ నౌకలు సముద్రంలో లంగరువేసి ఆగిపోయాయి. అతి పెద్ద యం.ఎస్.సీ యునైటెడ్ వాణిజ్య నౌకపై డిసెంబర్ 26న హౌతీ మిలిటరీ క్షిపణితో దాడి చేసినట్లుగా వెల్లడించింది. గెలక్సీ లీడర్ అనే ఇజ్రాయిల్ వ్యాపారి నౌకను హైజాక్‌చేసి 25 మంది సిబ్బందిని ఎమెన్ లో నిర్బంధించారు. ఇజ్రాయిల్‌తో అంటకాగుతున్న ఇండియా నౌకలను కూడా వదలలేదు. ఇండియా వస్తున్న ఎం.వి.కెమ్. ఫ్లూటో నౌక పైనా, సౌదీనుండి వస్తున్న ఎం.వి.సాయిబాబా నౌకల పైన కూడా డ్రోన్ దాడులు జరిగాయి. భారతదేశం 3 యుద్ధ నౌకలను కాపలాగా పంపించింది. అందులో "ఐ యన్ యస్ మార్మగో" గైడెడ్ మిస్సైల్ విధ్వంసక నౌక కూడా వుంది. నౌకలు ఎర్రసముద్రం ద్వారా రోజుకి 16 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించి 25 రోజులలో యూరప్‌ని చేరుతున్నాయి. ఎర్రసముద్రాన్ని తప్పించి ఆఫ్రికా చుట్టూ తిరిగి గుడ్ హోప్ మార్గం ద్వారా ప్రయాణించటానికి 43 రోజులు పట్టుంది. వ్యయ ప్రయాసలకోర్చి మార్గాన్ని మార్చే ప్రయాణానికి 9 రోజులనుండి 30 రోజులు ఆలస్యమవుతుంది. 15 రోజులు ప్రయాణ కాలం పెరిగితే నౌకకు ఇంధనం ఖర్చు అదనంగా 10లక్షల డాలర్ల వుతాయి. వందకు పైగా వాణిజ్య నౌకలు రూటు మార్చుకున్నాయి. ఆఫ్రికా చుట్టూ తిరిగి వెళ్తున్నాయి. ఆయిల్ ధరలు 3 శాతం పెరిగి ఒక బారల్ చమురు ధర 80 డాలర్లకు చేరింది. బీమా కంపెనీలు ప్రతి కంటైనర్ మీద 700 డాలర్ల సర్ ఛార్జి విధిస్తున్నారు. నిత్యవసరవస్తువులన్నిటికీ ఆసియా, ఆఫ్రికా దేశాలపై ఆధారపడిన అమెరికా, యూరప్ దేశాలు సరుకుల రవాణా ఆలస్యాన్ని భరించలేవు. ఖర్చు పెరుగుతుంది. ఆసియా దేశాలకు చమురు, సహజ వాయువు దిగుమతులు కష్టమవుతాయి. ప్రపంచవ్యాప్తంగా ధరలు పెరిగి ద్రవ్యోల్బణం సంభవించి ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుంది. అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రమాదంగా పరిణమించిన సమస్యను పరిష్కరించాలంటే గాజాపై ఇజ్రాయిల్ 83 రోజుల మానవ హననాన్ని ఆపేటట్లుగా ప్రపంచ ప్రజలు ఉద్యమించాలి.

జేడీయూ అధ్యక్షుడిగా నితీశ్

పాట్నా : 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్షుడిగా మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం దిల్లీలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ప్రస్తుత అధ్యక్షుడు రాజీవ్ రంజన్ (లాలన్) సింగ్ పదవీ విరమణ చేయడంతో నితీశ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తర్వాత జరగనున్న పార్టీ జాతీయ సమితి సమావేశం, కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే అవకాశం ఉంది. ఈ కీలక సమయంలో పార్టీ అత్యంత ప్రముఖ వ్యక్తి అయిన నితీశ్ పార్టీ బాధ్యతలు చేపట్టాలని చాలా మంది కీలక నేతలు అభిప్రాయపడ్డారని ఆ వర్గాలు తెలిపాయి. ఇదిలాఉండగా, సమావేశం ముగిసిన వెంటనే లాలన్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో చీలిక గురించి వస్తున్న చర్చను కొట్టిపారేశారు. 'కోపం? ఏమి కోపం? నేను ఎందుకు కోపంగా ఉండాలి? నేను ఈ మాట వినడం ఇదే మొదటిసారి' అని అన్నారు. లాలూ యాదవ్ తనయుడు, ఉప ముఖ్యమంత్రి అయిన ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ బీహార్‌లో జేడీయూ కూటమి భాగస్వామి. అయితే రాష్ట్రీయ జనతాదళ్‌కు కొంచెం సన్నిహితంగా ఉన్నందున లాలన్‌సింగ్‌ను తొలగించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. లాలూ యాదవ్ తనతో 'జేడీ(యూ) త్వరలో ఆర్‌జేడీలో విలీనం అవుతుంది' అని చెప్పారని బీజేపీ నాయకుడు, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్న తర్వాత జేడీ(యూ)లో కొంత గందరగోళం నెలకొంది. అయితే ఈ వ్యాఖ్యలను తేజస్వి యాదవ్ తోసిపుచ్చారు. రాష్ట్రంలో జేడీ(యూ)-ఆర్‌జేడీ కూటమిని అస్థిరపరిచేందుకు ప్రతిపక్ష బీజేపీ ఇటువంటి 'కథనాలు వండుతుంది' అని ఆరోపించారు. అధికారికంగా, లాలన్ సింగ్ వచ్చే ఏడాది ఎన్నికలకు ముందు తన నియోజకవర్గంపై దృష్టి పెట్టడానికి మరింత సమయం కావాలని నితీశ్‌కు చెప్పారు. సింగ్ బీహార్‌లోని ముంగేర్ నుంచి రెండుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. బీహార్ మంత్రి విజయ్ కుమార్ చౌదరి మాట్లాడుతూ 'తాను ఎన్నికలలో బిజీగా ఉంటానని లాలన్ సింగ్ చెప్పారు. అందువల్ల, పార్టీ అధ్యక్ష పదవిని ముఖ్యమంత్రికి అప్పగించాలనుకుంటున్నారు. నితీష్ కుమార్ దానిని అంగీకరించారు' అని వివరించారు. జేడీ(యూ) అగ్ర నాయకత్వంలో మార్పు కూడా 2024 లోక్‌సభ ఎన్నికలకు నెలల ముందు వస్తుందని, ఆ రేసులో నితీశ్ ప్రధాన మంత్రి ఆశయాలపై ఊహాగానాలు వచ్చాయి. అయితే బీహార్‌లో రాజకీయ పునర్వ్యవస్థీకరణ గురించి వచ్చిన వదంతులను బీహార్ మంత్రి ఖండించారు.

నితీశ్ కుమార్ గత రెండు దశాబ్దాలుగా బీజేపీ సహాయంతో, ఆర్‌జేడీ, కాంగ్రెస్ మహాఘటబంధన్‌తో ముఖ్యమంత్రిగా కొనసాగుతూ అనేక సార్లు పార్టీ మారారు. అగ్ర నాయకత్వం మధ్య విభేదాల నివేదికల మధ్య జేడీ(యూ) లో ఈ పరిణామం చోటు చేసుకుంది. లాలన్ సింగ్ నాయకత్వ శైలిపై కొందరు నేతలు అసంతృప్తిగా ఉన్నారని, దీనిపై నితీశ్‌తో చర్చించారని వార్తా సంస్థ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ పేర్కొంది. లాలన్ సింగ్ 'ఇండియా' కూటమి విషయంలో పార్టీని మెరుగైన రీతిలో తీర్చిదిద్దడంలో విఫలమైనందున నితీశ్ అసంతృప్తిగా ఉన్నారని ఆ వర్గాలు తెలిపాయి. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో నితీశ్ కీలక పాత్ర పోషించారు. సంకీర్ణానికి నాయకత్వం వహించే ముందున్న వారిలో ఆయన ఒకరు.

ఉల్లి ఎగుమతులపై నిషేధం...

కేంద్రాన్ని నిలదీయరా: ఎన్‌సీపీ

ముంబై: ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎన్‌సీపీ ఎంపీ అమోల్ కోలే విమర్శించారు. ప్రతిపక్ష మహావికాస్ అఘాదీ(ఎంవీఏ) కూటమి అధ్వర్యాన జరుగుతున్న రైతుల ఆందోళనకు కోలే నాయకత్వం వహిస్తున్నారు. పూనెలోని ఖడ్కీలో జరిగిన సభలో కోలే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శించారు. షేత్కారీ ఆక్రోశ్ మోర్చా అధ్వర్యంలో మూడు రోజుల క్రితం ఛత్రపతి శివాజీ మహారాజ్ పుట్టిన శివనేరి పోర్టు వద్ద రైతుల ఆందోళన ప్రారంభమైంది. డిసెంబరు 30న(శనివారం) పూనెలో కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేయనున్నారు. కోలే మాట్లాడుతూ తమది రైతుల ప్రభుత్వమని షిండే ప్రభుత్వం పదేపదే గొప్పలు చెప్పుకుంటున్నదని, కానీ ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేయాలని సీఎం షిండే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్ కేంద్రాన్ని డిమాండ్ చేయడం లేదని విమర్శించారు. 2024 మార్చి 31 వరకు ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించిన విషయం విదితమే. కేంద్ర ప్రభుతం నిషేధం విధించడం వల్ల తమ పంటలకు మంచి ధర వస్తుందని రైతులు భావించారని కోలే చెప్పారు. ఉల్లి ఉత్పత్తిదారులు రూ.1200 కోట్ల మేరకు నష్టపోయారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లలేదని అన్నారు.

23 సీట్లలో పోటీచేస్తాం

సంజయ్‌రౌత్ పునరుద్ఘాటన



ముంబై: మహారాష్ట్రలో ప్రతిపక్ష కూటమి మధ్య సీట్ల సర్దుబాటు మాటలయుద్ధానికి దారితీస్తోంది. మొత్తం 48 లోక్‌సభ సీట్లకుగాను 23 స్థానాల్లో తాము పోటీ చేస్తామని శివసేన(ఉద్ధవ్) పార్టీ ప్రకటించడం, అందుకు కాంగ్రెస్ నిరాకరించడం తెలిసిందే. తాజాగా శివసేన(ఉద్ధవ్) పార్టీ నేత సంజయ్‌రౌత్ శుక్రవారం మళ్లీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. 23 సీట్లలో తమ పార్టీ పోటీ చేస్తుందని, సీట్ల సర్దుబాటుపై జీరో నుంచి కాంగ్రెస్‌తో చర్చలు ప్రారంభించాల్సి ఉంటుందని సంజయ్‌రౌత్ చెప్పారు. రౌత్ శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీ గెలిచిన సీట్లపై చర్చలు జరుగుతున్నాయన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉద్ధవ్ నేతృత్వాన గల ఐక్య శివసేన 23 సీట్లలో పోటీ చేసి...18 సీట్లు గెలిచింది. అయితే, ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటుతో శివసేన గతేడాది రెండుగా చీలింది. చివరికి శివసేన పార్టీ పేరును షిండే వర్గానికే ఎన్నికల కమిషన్ కట్టబెట్టింది. శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్‌సీపీ నాలుగు సీట్లలో విజయం సాధించింది. కాంగ్రెస్ కేవలం ఒక్క సీటునే గెలుచుకుంది. ఆ పార్టీ తరపున గెలిచిన బాలు ధనోర్కర్ గతేడాది చనిపోయారు. సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గేతో పాటు ఆ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఉద్ధవ్ ఠాక్రే సహా శివసేన(ఉద్ధవ్) పార్టీ నాయకులు చర్చలు జరుపుతున్నట్లు రౌత్ చెప్పారు. మహారాష్ట్రలో 23 సీట్లు, దాద్రా నగర్ హవేలీలో తాము పోటీ చేస్తామని ఇప్పటికే

కాంగ్రెస్‌కు చెప్పామన్నారు. మహారాష్ట్రలో శివసేన అతి పెద్దపార్టీ అని, కాంగ్రెస్ జాతీయ పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు.

నేడు అయోధ్యకు మోదీ

భారీ భద్రతా ఏర్పాట్లు...మత చిహ్నాలతో అలంకరణ



అయోధ్య: ప్రధాని నరేంద్రమోదీ అయోధ్య పర్యటన కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాని రాక సందర్భంగా అయోధ్య నగరాన్ని రంగులు, పూలతో అలంకరించారు. దీంతోపాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయోధ్య డివిజనల్ కమిషనర్ గౌరవ్ దయాల్ మాట్లాడుతూ రెండు రోజుల నుంచి నగరంపై భారీగా పొగమంచు కమ్ముకున్నప్పటికీ ప్రధాని పర్యటన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అయోధ్య రైల్వే స్టేషన్‌ను, కొత్త విమానాశ్రయం ప్రారంభించడానికి ప్రధాని మోదీ శనివారం అయోధ్య వస్తున్నారు. విమానాశ్రయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తారు. 'ఉదయం 10.45 గంటలకు ప్రధాని అయోధ్య విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు వెళతారు. సరిహద్దు హంగులతో తిరిగి అభివృద్ధి చేసిన రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తారు. తిరిగి విమానాశ్రయం చేరుకొని...కొత్తగా నిర్మించిన ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తారు. తర్వాత బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తారు' అని దయాల్ పీటీఐకి చెప్పారు. ప్రధాని పర్యటన సందర్భంగా అయోధ్య నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అయోధ్య రైల్వేస్టేషన్‌ను మతపరమైన చిహ్నాలతో అలంకరించారు. రాముడు ఉపయోగించినట్లు భావిస్తున్న విల్లు, బాణం గుర్తులు ఉన్నాయి. అయోధ్య రైల్వే స్టేషన్‌కు అయోధ్యధామ్‌గా నామకరణం చేశారు.

బీజేపీ మత రాజకీయం

ఆలయ ప్రారంభోత్సవంపై ఏచూరి

కన్నూరు: అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటుందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. మతపరమైన మనోభావాలను పూర్తిగా దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ సహా రాజ్యాంగబద్ధ పదవులు అనుభవిస్తున్న నేతలు హాజరు కావడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఏచూరి ఆరోపించారు. ఏచూరి శుక్రవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మన రాజ్యాంగం సెక్యులరిజానికి స్పష్టమైన నిర్వచనం ఇచ్చిందని, రాజకీయాలు, రాజ్యానికి మతం దూరమని పేర్కొన్నదని తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని పూర్తి మత రాజకీయంగా మోదీ, బీజేపీ మార్చివేసినట్లు ఏచూరి విమర్శించారు. ఇది రాజ్యాంగ విలువలకు పూర్తి భిన్నమని వ్యాఖ్యానించారు. 'రామాలయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ హాజరవుతున్నారు. వారు రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మత మనోభావాలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని మేము బలంగా విశ్వసిస్తున్నాం. ఇది మతాన్ని బహిరంగంగా రాజకీయం చేయడమే. రాజ్యాంగం, సుప్రీంకోర్టు తీర్పులు ఇందుకు పూర్తి వ్యతిరేకం' అని సీతారాం ఏచూరి స్పష్టంచేశారు. ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా ఉందని బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని ఏచూరి కొట్టిపారేశారు. ఇదంతా తప్పుడు ప్రచారమని వ్యాఖ్యానించారు. ప్రజలకు సంబంధించి గడచిన పదేళ్లుగా దేశంలో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా దిగజారాయని విమర్శించారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రభుత్వం ఇస్తున్న లెక్కలన్నీ తప్పుడవేనని చెప్పారు. నిరుద్యోగానికి సంబంధించి ప్రభుత్వం అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. స్వదేశీ డిమాండ్ లేకపోవడంతో దేశంలో పరిశ్రమల వృద్ధి తగ్గిందన్నారు. తలసరి ఆదాయం లెక్కన చూస్తే...180 దేశాల్లో భారత్ 142వ స్థానంలో నిలిచిందని విమర్శించారు. జీ 20 దేశాల తలసరి ఆదాయంతో పోలిస్తే భారత్ అట్టడుగుస్థాయిన నిలిచిందని వివరించారు. ప్రజల అవస్థలు పెరిగాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆకలి సూచీ వంటి అన్ని అంశాల్లోనూ భారత్ దిగజారిందన్నారు. అయితే, మోదీ ప్రభుత్వం మాత్రం ఈ నివేదికలన్నింటినీ కొట్టిపారేస్తోందని ఏచూరి విమర్శించారు.

14 నుంచి రాహుల్ 'భారత్ న్యాయ యాత్ర'

విస్తృత ఏర్పాట్లకు కాంగ్రెస్ కసరత్తు

చిహ్నం, మార్గం ఖరారుకు కీలక భేటీ

న్యూదిల్లీ : జనవరి 14 నుంచి రాహుల్ గాంధీ చేపట్టనున్న 'భారత్ న్యాయ యాత్ర'కు విస్తృత ఏర్పాట్లు చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు సాగిస్తోంది. మణిపూర్ నుంచి ముంబై వరకూ సాగే ఈ యాత్ర రూట్ మ్యాప్, లోగోను ఖరారు చేసేందుకు యాత్ర కొనసాగే 14 రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు సీఎల్పీ నేతలతో జనవరి 4న సమావేశం ఏర్పాటు చేసింది. జనవరి 4న భారత్ న్యాయ యాత్ర లోగోను విడుదల చేయనుండగా రూట్ మ్యాప్‌ను 8న కాంగ్రెస్ ప్రకటించనుంది. యాత్ర థీమ్ సాంగ్‌ను జనవరి 12న విడుదల చేస్తారు. భారత్ న్యాయ యాత్రలో పార్టీ నేతలు కొన్ని కిలోమీటర్లు పాదయాత్రగా ముందుకు సాగనుండగా మిగిలిన యాత్ర పొడవునా వాహనాలను ఉపయోగిస్తారు. యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ వివిధ వర్గాల ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.

ఈ యాత్ర 14 రాష్ట్రాల్లోని 85 జిల్లాల మీదుగా సాగుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రజల మద్దతును కూడగట్టేందుకు కాంగ్రెస్ భారత్ న్యాయ్ యాత్రను చేపడుతోంది. కాగా గత ఏడాది రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ కాలినడకన భారత్ జోడో యాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. 136 రోజుల పాటు 4 వేల కిలోమీటర్లు రాహుల్ గాంధీ నడిచారు. భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ యువత, మహిళలు, వృత్తిదారులు, గిరిజనులు సహా అనేక వర్గాల ప్రతినిధులతో మమేకమవుతూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కేరళ కేబినెట్ మంత్రులుగా ఇద్దరు ప్రమాణం

తిరువనంతపురం: కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంలో మరో ఇద్దరు కొత్త మంత్రులుగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎల్‌డీఎఫ్ మిత్రపక్షాల నాయకులు రామచంద్రన్ కదనప్పల్లి(కాంగ్రెస్-ఎస్), కేబీ గణేశ్ కుమార్(కేరళ కాంగ్రెస్-బీ) నేతలు మంత్రులుగా ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నరు ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేబినెట్ మంత్రులు, వామపక్ష కూటమి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేశ్‌కుమార్‌ను మంత్రివర్గంలో చేర్చుకోవడంతో కాంగ్రెస్ నేతృత్వాన గల యూడీఎఫ్ ఈ కార్యక్రమానికి గైర్హాజరైంది. కేబినెట్‌లోకి ఇద్దరు కొత్త మంత్రులను చేర్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నరు అంతకుముందు ఆమోదం తెలిపారు. కేబినెట్ విస్తరణ చేస్తామని, కొత్తమంత్రులు డిసెంబరు 29న ప్రమాణం చేస్తారని ఎల్‌డీఎఫ్ గత ఆదివారమే ప్రకటించింది.

సోనియా హాజరుపై తగిన సమయంలో నిర్ణయం

న్యూదిల్లీ: వచ్చే ఏడాది జనవరి 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. ఈ ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ హాజరుపై ఆ పార్టీ స్పందించింది. ఈ కార్యక్రమానికి సోనియాతో పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరికీ ఆహ్వానం అందిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీరు హాజరవుతారని వార్తలు వస్తున్నప్పటికీ.. దీనిపై తగిన సమయంలో నిర్ణయం ప్రకటిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శుక్రవారం వెల్లడించారు. ఈ అంశంపై మిత్ర పక్షాలతో చర్చలు జరిపిన తర్వాత కాంగ్రెస్ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇంతకుముందు అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవానికి సోనియా హాజరుకానున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

సంతానోత్పత్తి కోసం ఖైదీకి నెల రోజుల పెరోల్

వంశాన్ని నిలబెట్టుకునే హక్కు ఖైదీలకూ ఉంటుంది:దిల్లీ హైకోర్టు

న్యూదిల్లీ: తమ వంశాన్ని నిలబెట్టుకునే హక్కు ఖైదీలకూ ఉంటుందని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. హత్య కేసులో జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్న వ్యక్తికి నాలుగు వారాల పాటు పెరోల్ మంజూరు చేసింది. తన భర్త ద్వారా సంతానాన్ని పొందే అవకాశం కల్పించాలన్న అతని భార్య అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. భార్య వయసు 38 ఏళ్లు, భర్త వయసు 41 ఏళ్లను ప్రస్తావిస్తూ....శిక్షా కాలం పూర్తయ్యాక ఆ దంపతులకు సంతానాన్ని పొందే వయసు మీరిపోతుందని, వయోభారం వారి ఉమ్మడి ఆకాంక్షకు అవరోధంగా మారుతుందని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ అభిప్రాయపడ్డారు. తన భర్త ద్వారా సంతానాన్ని పొందాలన్న భార్య హక్కును ప్రభుత్వం అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులోని పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత ఖైదీకి తన వంశాన్ని నిలుపుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తీర్పులో వివరించారు. దాంపత్య జీవనం కోసం అనుమతివ్వడం లేదని, వంశాన్ని నిలబెట్టుకోవాలన్న భార్య ఆకాంక్షను, హక్కును గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఖైదీ ఇప్పటికే 14 ఏళ్లుగా జైలులో ఉన్న విషయాన్నీ న్యాయమూర్తి ప్రస్తావించారు. పెరోల్ కోసం రూ.20 వేలకు వ్యక్తిగత బాండును సమర్పించడంతో పాటు ఒకరి పూచీకత్తు ఇవ్వాలని షరతు విధించారు.

రాహుల్ యాత్రపై స్మృతి ఇరానీ విమర్శలు

లక్నో: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ చేపట్టబోయే 'భారత్ న్యాయ యాత్ర'పై కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరాని విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ 'భారత్ న్యాయ యాత్ర'సంబంధించిన విషయం విన్నానని తెలిపారు. ఈ రోజుల్లో అన్యాయానికి తెలిసిన వ్యక్తులు.. న్యాయం చేస్తున్నట్లు నటిస్తున్నారని(రాహుల్ గాంధీని ఉద్దేశించి)ఎద్దేవా చేశారు. రెండు రోజుల అమేథీ పర్యటనలో కేంద్ర మంత్రి స్మృతి ఇరాని పాల్గొన్నారు. గౌరీగంజ్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో జరిగిన సామాజిక సాధికారత శిబిరం వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రతి ఏడాది 10 కోట్ల మంది పేద కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఇక.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాహుల్ గాంధీ 'భారత్ న్యాయ యాత్ర' పేరుతో తూర్పున మణిపూర్ నుంచి పశ్చిమాన మహారాష్ట్ర వరకు పాదయాత్ర చేపట్టనున్నారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

నలుగురు ఎయిర్ ఇండియా సిబ్బంది, ప్రయాణికుడి అరెస్టు

న్యూదిల్లీ: ఫ్రాన్స్‌లో ఇటీవల నిలిపివేసిన భారతీయులు ప్రయాణిస్తున్న విమానంలో పది మంది ఎవరూ తోడు లేని మైనర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా నలుగురు ఎయిర్ ఇండియా సిబ్బంది, ఒక భారతీయ ప్రయాణికుడిని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరు యూకే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) వారిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విమానాశ్రయంలోని ఇమ్మిగ్రేషన్ అధికారులకు దిల్‌జోత్‌సింగ్ అనే ప్రయాణికుడి డాక్యుమెంట్లపై కొంత అనుమానం రావడంతో వివరాలు సేకరించారు. దాంతో ఆయన ఎయిర్‌లైన్ సిబ్బందిని సంప్రదించడానికి బదులుగా ఎయిర్ ఇండియా సాట్స్ సిబ్బంది సహాయం కోరాడు. వెంటనే అధికారులకు అనుమానం రెట్టింపైంది. సీఐఎస్ఎఫ్ బృందం అప్రమత్తమై దిల్లీ ఎయిర్‌పోర్ట్ అథారిటీ సహకారంతో విచారణ చేపట్టింది. అయితే సింగ్‌కు సహకరించిన మరో నలుగురు ఎయిర్ ఇండియా స్టాఫర్లను సైతం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఫ్రాన్స్‌లో నిలిపివేసిన విమానంలో మైనర్లు ఉన్నట్లు అధికారులు ఇటీవల గుర్తించారు. మానవ అక్రమ రవాణా కోణంలో ఈ కేసును విచారిస్తున్నట్లు తెలిసింది. ఎయిర్ ఇండియా సాట్స్ సీఈఓ సంజయ్‌గుప్తా స్పందిస్తూ నిందితుడికి సహకరించిన సంస్థ సిబ్బందిని విధుల్లో నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. మానవ అక్రమ రవాణాపై కంపెనీ పకడ్బందీ చర్యలు చేపడుతుందన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ రణరంగం ... పిడిగుద్దులు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని షామ్లీ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. అభివృద్ధి నిధుల విషయంలో కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. దీంతో ఎలాంటి చర్చా జరుగకుండానే సమావేశం ముగిసింది. షామ్లీ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రూ.4 కోట్ల మేర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన అంశంపై చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇద్దరు సభ్యుల మధ్య మాటామాటా పెరిగింది. ఎమ్మెల్యే, కౌన్సిల్ చైర్మన్ ఎదుటే బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. వారిని ఆపడానికి వెళ్లిన మరో సభ్యుడికి కూడా దెబ్బలు తప్పలేదు. దీంతో కొన్ని నిమిషాల్లో మునిసిపల్ కౌన్సిల్ కాస్తా రెజ్లింగ్ బౌట్‌గా మారిపోయింది. దీంతో చైర్మన్ సభను వాయిదా వేశారు. కాగా, ఈ ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందించారు. అభివృద్ధి ఏం జరగనప్పుడు సమీక్షా సమావేశంలో ఇంతకంటే ఏం చేస్తారు. బీజేపీ పాలన ద్వారా నేర్చుకున్నదిదే. ఇకపై సొంతంగా భద్రత ఏర్పాటు చేసుకుని సమావేశాలకు రావాల్సిందే అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ఘర్షణకు సంబంధించిన వీడియోను పోస్టు చేశారు.

హిందుత్వ సిద్ధాంతం...హిందు విశ్వాసాలు వేర్వేరు

బీజేపీ వారే రాముడిని పూజిస్తారా?

కర్నాటక సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు: దేశంలో సార్వత్రిక ఎన్నికలు మరో నాలుగు నెలల్లోగా జరగాల్సి ఉండటం, దీనికి ముందు వచ్చే జనవరి 22న అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం ఉన్న నేపథ్యంలో హిందుత్వ సిద్ధాంతం, హిందూ విశ్వాసాల మధ్య తేడా ఉందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి వ్యాఖ్యానించారు. కేవలం హిందువుల ఓట్ల కోసమే బీజేపీ హిందుత్వ సిద్ధాంతాన్ని రాజకీయం చేస్తోందన్నారు. ఒక వైపు మైనారిటీ ఓట్లు పోకుండా, మరోవైపు మోడరేట్ హిందూ ఓట్లు దక్కించుకునేందుకు రాజకీయ వ్యూహంగా 'సాఫ్ట్ హిందుత్వ'ను పావుగా వాడుకుంటున్నట్టు కనిపిస్తోందన్నారు. హిందుత్వలో సాఫ్ట్ హిందుత్వ, హార్డ్ హిందుత్వ ఏమిటని నిలదీశారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'హిందుత్వ అంటే హిందుత్వనే... నేను హిందువుని... హిందుత్వం, హిందు అనేవి వేర్వేరు. మనం రాముడిని ఆరాధించ లేదా? వాళ్లు (బీజేపీ) మాత్రమే రాముడిని ఆరాధిస్తున్నారా? మన గ్రామాల్లో రామమందిరాలు నిర్మించలేదా? రాముడి భజనలు చేయలేదా?' అని సిద్ధరామయ్య ప్రశ్నించారు. డిసెంబర్ చివరి వారంలో భజనలు జరుగుతుంటాయని, తమ గ్రామంలోనూ అలాంటి వేడుకలు జరుగుతుంటాయన్నారు. తాను సైతం అందులో పాలుపంచుకుంటూ ఉంటానని చెప్పారు. సిద్ధరామయ్య గత ఫిబ్రవరిలోనూ విపక్ష నేతగా ఉన్నప్పుడు ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. హిందుత్వ అనేది రాజ్యాంగవిరుద్ధమని, హిందుత్వ, హిందూ ధర్మం వేర్వేరని అన్నారు. తాను హిందూ మతానికి వ్యతిరేకం కాదని, తాను హిందువునని, కానీ మనువాదం, హిందుత్వకు వ్యతిరేకినని స్పష్టం చేశారు. హత్యలను ఏ మతం సమర్థించదని, కానీ హిందుత్వ మద్దతుదారులు హత్యలు, వివక్షను సమర్థిస్తారని తీవ్ర ఆరోపణలు చేశారు. గత జనవరిలో కూడా తాను హిందువునని, హిందుత్వను వ్యతిరేకిస్తానని ఆయన చెప్పారు. తాను రామాలయాన్ని ఎప్పుడూ వ్యతిరేకించలేదని, కానీ రాజకీయ ప్రయోజనాలకు దానిని వాడుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నానని వ్యాఖ్యానించారు. హిందుత్వపై సిద్ధరామయ్య వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

దిల్లీలో క్యాబ్ డ్రైవర్ దారుణ హత్య

న్యూదిల్లీ: ఓవర్ టేక్ చేసేందుకు బైక్‌కు దారి ఇవ్వలేదన్న కోపంతో క్యాబ్ డ్రైవర్‌ను కత్తితో పొడిచి హత్య చేశారు. దేశ రాజధాని దిల్లీలో జరిగిన ఈ దారుణ సంఘటన కలకలం రేపింది. సంగం విహార్ ప్రాంతానికి చెందిన మనోజ్ కుమార్ గురుగ్రామ్‌లోని ఒక కంపెనీలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం మాల్వియా నగర్ నుంచి ఐదుగురు ఉద్యోగులను కారులో ఎక్కించుకున్నాడు. మరో ఉద్యోగి పికప్ కోసం మెహ్రౌలీకి వెళ్తుండగా రాత్రి 8.40 గంటల సమయంలో ట్రాఫిక్ జామ్‌లో కారు చిక్కుకుంది. కాగా, బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు ఓవర్ టేక్ కోసం దారి ఇవ్వాలని క్యాబ్ డ్రైవర్ మనోజ్‌ను అడిగారు. అయితే బైక్ వెళ్లే గ్యాప్ లేకపోవడంతో దీనికి నిరాకరించాడు. ఈ నేపథ్యంలో బైక్‌పై ఉన్న ముగ్గురు అతడితో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో ఒక వ్యక్తి కత్తితో మనోజ్ ఛాతీపై పొడిచాడు. అనంతరం వారు అక్కడి నుంచి బైక్‌పై పారిపోయారు. మరోవైపు కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన క్యాబ్ డ్రైవర్ మనోజ్‌ను స్థానికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలో అతడు మరణించాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. మైనర్ అయిన ఒక నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

జార్ఖండ్‌లో 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ శుక్రవారం కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ తీసుకునే వారి వయో పరిమితిని తగ్గించారు. పెన్షన్ అర్హత వయసును 60 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు తగ్గిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం సోరెన్ తెలిపారు.

ఇక నుంచి 50 ఏళ్లు దాటిన వారు కూడా వృద్ధాప్య పెన్షన్ అందుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే కంపెనీల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వనున్నట్లు కూడా ఆయన ప్రకటించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు

సంస్థ పునరుద్ధరణకు వనరులు - ఇనుప ఖనిజ గనిని కేటాయించాలి

ప్రధాని మోదీకి లేఖలో రామకృష్ణ డిమాండ్

విజయవాడ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయడం లేదని అధికారికంగా ప్రకటించాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారం పునరుద్ధరణకు అవసరమైన వనరులు సమకూర్చాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి గురువారం ఓ లేఖ రాశారు. స్టీల్ ప్లాంటుపై ఒత్తిడి తెచ్చి దీని విలువైన భూములను అదానీ గ్రూపుకు దారాదత్తం చేసే ప్రయత్నాలను ఉక్కు మంత్రిత్వశాఖ విరమించుకోవాలని పేర్కొన్నారు. ప్లాంటు మూడవ బ్లాస్ట్ ఫర్నేస్ నిర్వహణ కోసం జిందాల్ గ్రూపుతో అవగాహన ఒప్పందంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంటు (వీఎస్పీ) బోర్డును భాగస్వామ్యం చేసే కసరత్తు తగదన్నారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు అన్ని విధాలా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ చర్యలతో స్పష్టమవు తోందని రామకృష్ణ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్‌ఈ) ఆర్థిక వనరులను సమ్మిళితం చేసి కర్మాగారాన్ని పునరుద్ధరించుకోవాల్సింది పోయి... స్టీల్ ప్లాంటును, దాని విలువైన ఆస్తులను, సమర్థ సిబ్బందిని వెండి కంచెంలో అలంకరించి మరీ ప్రైవేటువారికి అప్పగించాలనుకోవడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని రామకృష్ణ అన్నారు. స్టీల్ ప్లాంటు కోసం ఇనుప ఖనిజ గనిని కేటాయించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంటు తనంతట తానుగా నిలద్రొక్కుకోగలదని, అందుకు కావాల్సిన వనరులను సమకూర్చాలని లేఖలో రామకృష్ణ కోరారు. ఉక్కు కర్మాగారాన్ని బలహీనపర్చేలా బాహ్య ఒత్తిళ్లు ఉన్నాయని, దాని విలువను తగ్గించి ప్రైవేటుకు కారు చౌకగా కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. ప్రజా ప్రయోజనాల కోసమని భూసేకరణ చట్టం కింద రైతుల నుంచి ఉక్కు కర్మాగారం కోసం భూమి సేకరించినట్లు గుర్తుచేశారు. పూర్తిగా ప్రభుత్వ పరిధిలో ఉంటుందని అప్పట్లో హామీ ఇచ్చారు కాబట్టి ఇప్పుడు స్టీల్ ప్లాంటులో ఏ భాగాన్ని ప్రైవేటుకు అప్పగించినా అది చట్టవ్యతిరేకమే అవుతుందని ప్రధానికి రామకృష్ణ స్పష్టంచేశారు. బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించడమన్నది యాజమాన్య నిర్ణయమని, తనకు సంబంధం లేదని స్టీల్ శాఖ చెప్పగలదా అని ప్రశ్నించారు. వీఎస్పీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లలో మంత్రిత్వశాఖకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులున్నందున దీనిపై చర్చ అవసరమన్నారు. ఉక్కు కర్మాగారానికి రుణ వ్యవస్థ పునర్నిర్మాణం, ఆర్థిక మద్దతును ఆర్థిక, ఉక్కు మంత్రిత్వ శాఖలు కల్పించకపోవడం దురదృష్టకరమని రామకృష్ణ అన్నారు. పీఎల్ఐ పథకం కింద ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా ఐదేళ్లలో రూ.2లక్షల కోట్ల సబ్సిడీలను మంజూరు చేయడమే కాకుండా విలువైన ఖనిజ బ్లాకులను అప్పగిస్తున్నారని కేంద్రాన్ని దుయ్యబట్టారు. ఈ చర్యలతో ప్రభుత్వరంగ బ్యాంకులు ఒత్తిడికి లోనవుతున్నాయన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం ఒక ఇనుప ఖనిజం గనిని కేటాయించడానికి ఈ మంత్రిత్వశాఖలు విముఖంగా ఉన్నాయన్న రామకృష్ణ.. ఇది కాగ్ ఆడిట్ అవసరమైన భారీ కుంభకోణం కావచ్చు అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. ఉక్కు కర్మాగారం సంబంధిత పరిణామాలు అన్నింటిని ఉత్తరాంధ్ర ప్రజలు, ఉద్యోగులు, భూములు ఇచ్చిన కుటుంబాలు నిశితంగా గమనిస్తాయన్న విషయాన్ని కేంద్రం గమనంలో ఉంచుకోవాలని రామకృష్ణ సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం పునరుద్ధరణకు ఉక్కు, ఆర్థిక శాఖలు సమన్వయం చేసుకొని తగు విధంగా చర్యలు తీసుకోలేని పక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలలో అసంతృప్తి పెరుగుతుందని, ఆపై పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని లేఖలో రామకృష్ణ హెచ్చరించారు.

వామపక్ష నేతల అరెస్టు దుర్మార్గం: రామకృష్ణ, శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయవాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా సీపీఐ, సీపీఎం నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడాన్ని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. సీఎం జగన్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పర్యటన సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి సీపీఐ, సీపీఎం తదితర నేతలను ముందస్తుగా అరెస్టులు చేయటం దుర్మార్గమని విమర్శించారు. సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తదితరులను గృహ నిర్బంధం చేశారని, సీపీఐ భీమవరం పట్టణ కార్యదర్శి సీహెచ్ రంగారావు, ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీనివాస్ తదితరులను పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారని పేర్కొన్నారు. ఈ అక్రమ అరెస్టులను సీపీఐ రాష్ట్ర సమితి, సీపీఎం రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి పోలీసు పహారా మధ్య పర్యటిస్తున్నారనటానికి ఇదే తార్కాణమని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయటం ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమేనని, ఇది రాష్ట్రంలో పరిపాటిగా మారిపోయిందని విమర్శించారు. ప్రజాతంత్ర వాదులంతా రాష్ట్ర ప్రభుత్వ, పోలీసు చర్యలను ఖండించాలని కోరారు. అరెస్టు చేసిన వారిని బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ సాంస్కృతిక సమైక్యతకు అనువాదాలే సాధనాలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): అనువాదం లేకపోతే జాతీయసమైక్యత, సాంస్కృతిక ఐక్యత, ప్రపంచ ఐక్యత లేవని ప్రముఖ రచయిత, అనువాదకులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై శుక్రవారం సాయంత్రం రెండో సభలో డాక్టర్ వెన్నా వల్లభరావు తెలుగు అనువాదం గావించిన అశోక శోకం హిందీ నాటక పుస్తకాన్ని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏ భారతీయ భాష రచన అయినా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకోవాలంటే దానిని హిందీలోకి అనువదించాలని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ˇ పూజనీయులైన శ్రీకృష్ణుడు, మహ్మద్ ప్రవక్త, ఏసు క్రీస్తు, గౌతమ బుద్ధుడు, మహాత్మా గాంధీలలో ముగ్గురు భారతీయులు కావడం మనకు గర్వకారణమన్నారు. వీరిలో బుద్ధభగవానుడికి ప్రపంచ ఖ్యాతి రావడానికి అశోకుడు కారణమన్నారు, వెన్నా వల్లభరావు అనువాదం అశోకుడిని తెలుగువారికి పరిచయం చేయడానికి ఉపకరిస్తుందన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మూలరచనకు వన్నె తెచ్చేలా అనువాదం చేయడం వల్లభరావుగారి గొప్పతనమన్నారు. పింగళి వెంకయ్యగారి చరిత్రను, త్యాగాలను సాధికారికంగా అందరికీ పరిచయం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన తెలుగులోరాసి ఆంగ్లంలోకి అనువదించిన 'పింగళి వెంకయ్య, డిజైనర్ ఆఫ్ ట్రికలర్' పుస్తకాన్ని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ ఆవిష్కరించారు. కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావుగారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అశోకశోకం పుస్తకాన్ని సాహితీ పోషకులు గోళ్ల నారాయణరావు, 'పింగళి వెంకయ్య' పుస్తకాన్ని నందూరి రాజగోపాల్ సభకు పరిచయం చేశారు. వర్తమానానికీ, గతానికీ మధ్య నిరంతర సంభాషణే చరిత్ర కనుక ఆ చరిత్రను మరింత చక్కగా అర్థం చేసుకొనేందుకు వెన్నా వల్లభరావు పుస్తకాలు ఉపయోగపడతాయని వారు వివరించారు.

నంది ఉత్తమ నాటక అవార్డుల విజేతలు వీరే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 22వ నంది ఉత్తమ నాటక అవార్డుల విజేతలను శుక్రవారం ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో గుంటూరు కేంద్రంగా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పద్య నాటకం, సాంఘిక నాటకం, సాంఘిక నాటిక, బాలల నాటిక, విశ్వవిద్యాలయ/కళాశాల నాటికల విభాగాల్లో ఎంపిక చేశారు. ప్రథమ స్థానంలో స్వర్ణ నంది, ద్వితీయంలో రజిత నంది, తృతీయంలో కాంస్య నందుల అవార్డులను భాగాల వారీగా ప్రదానం చేశారు. పద్య నాటకం విభాగంలో మాధవ వర్మ, శ్రీకాంత కృష్ణమాచార్య, వసంత రాజీయం, సాంఘిక నాటకం విభాగంలో ఇంద్రప్రస్థం, ద ఇంపోస్టర్స్, కలనేత ఉన్నాయి. అలాగే, సాంఘిక నాటికల్లో ఆస్థికలు, కమనీయం, చీకటి పువ్వు, బాలల నాటికల విభాగంలో ప్రపంచ తంత్రం, బాధ్యత, మూడు ప్రశ్నలు, విశ్వవిద్యాలయం/కళాశాల నాటికలో విభాగంలో ఇంకానా, కపిరాజు, ఉద్దం సింగ్ ఎంపికయ్యాయి.

ప్రభుత్వం అంగన్‌వాడీలను రెచ్చగొట్టడం మానుకోవాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్‌వాడీలను రెచ్చగొట్టే ప్రకటనలను ప్రభుత్వం మానుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తల నిరవధిక సమ్మెకు కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సంఘీభావ కార్యక్రమంలో భాగంగా విజయవాడలో శుక్రవారం కార్మిక సంఘాలు నిరసన ర్యాలీ నిర్వహించాయి. అనంతరం ధర్నా చౌక్‌లో జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన కార్యక్రమంలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పత్రికా ప్రకటనల్లో, యూట్యూబ్ ఛానల్స్ ద్వారా అంగన్‌వాడీలకు అన్నీ చేశామని, కొన్ని రాజకీయ పార్టీల అండదండలతో అనవసర సమ్మె చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అంగన్‌వాడీల ఉద్యమంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, నాలుగున్నర సంవత్సరాలుగా జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని వివిధ రూపాల్లో ఆందోళన చేశారని గుర్తు చేశారు. ఇప్పటికీ ఆ వాగ్దానం అమలు పరచకపోవడంతో నిరవధిక సమ్మె చేయవలసి వచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చి గ్లోబెల్ ప్రచారం చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఈ విధంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసులు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు రవిచంద్ర అంగన్‌వాడీలకు సంఘీభావంగా ప్రసంగించారు. అంతకుముందు వివిధ కార్మిక సంఘాలు లెనిన్ సెంటర్ నుంచి ప్రదర్శనగా ధర్నా చౌక్ చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ నగర నాయకులు మూలి సాంబశివరావు, వియ్యపు నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు నాయకత్వం వహించారు.

మా సమస్యలు పరిష్కరించండి

ఏపీ గ్రామ వార్డు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల వినతి

విశాలాంధ్ర-విజయవాడ: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పని విధి విధానాలు నిర్ణయించాలని ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల సమాఖ్య డిమాండ్ చేసింది. ఇదే అంశమై సమాఖ్య అధ్యక్షులు కె.సునీత, ప్రధాన కార్యదర్శి పి.లీల, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివ, కోశాధికారి శంకరమ్మ శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఏఎన్ఎం/ హెల్త్ సెక్రటరీలుగా నియమితులైన తమకు డీఎం అండ్ హెచ్‌ఓ, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు పనులు చెబుతుంటే ఎవరి చెప్పింది చేయాలో అర్థం కావట్లేదన్నారు. ఆన్‌లైన్ ఆప్‌లలో డేటా అప్‌డేట్ చేసుకుంటూ, రికార్డ్ పనిచేయడానికి సమయం కేటాయించడం వల్ల ప్రత్యక్షంగా విధులు నిర్వహించడానికి మానసిక ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. ఏఎన్ఎం ఏపీ హెల్త్ యాప్‌ని పూర్తిగా తొలగించాలని కోరుతూ తాము నిర్వహించాల్సిన రిజిస్టర్లని, ప్రింటెడ్ అయిన నాణ్యమైన రిజిస్టర్లను గవర్నమెంట్ సమకూర్చాలని కోరినట్లు తెలిపారు. సచివాలయ హెల్త్ సెక్రటరీలకు గుర్తింపు ఉండేలాగా యూనిఫామ్, యూనిఫామ్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. గతంలో ఇచ్చిన ఆర్‌సీహెచ్ అలవెన్సును పునరుద్ధరించాలని కోరారు. యాప్స్ భారం ఎక్కువగా ఉన్నందున ఆర్ఐ సెషన్‌లను నాలుగుకు కుదించేలా ఆదేశాలు జారీ ఇవ్వాలని, ఎంఐ స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్ పనికి అలవెన్సులు ఇవ్వాలని కోరామని చెప్పారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ హామీనిచ్చినట్లు తెలిపారు.

4 నుంచి జయహో బీసీ

- ప్రత్యేక మ్యానిఫెస్టో విడుదల చేస్తాం
- టీడీపీ-జనసేన మధ్య అద్భుత సమన్వయం
- వ్యూహం సినిమా నిర్మాత జగనే
- టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు జనవరి 4 నుంచి జయహో బీసీ పేరిట ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమ నిర్వహణపై తొలుత చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఒక వర్క్ షాపు ఏర్పాటు చేసుకుంటామని, జనవరి 4 నుంచి పార్లమెంటు, అసెంబ్లీ మండల స్థాయిల్లో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో ఒక భారీ సభ ఏర్పాటు చేసి బీసీలకు ప్రత్యేకంగా మ్యానిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. యువగళం పాదయాత్రలో బీసీ సోదరులు పడుతున్న ఇబ్బందులు తెలుసు న్నానని తెలిపారు. తాను తిరగని మండలాల్లో కూడా జయహో బీసీ ద్వారా సమస్యలు తెలుసుకోవాలని పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు లోకేశ్ వెల్లడించారు. బీసీ సోదరులకు పుట్టినిల్లు టీడీపీ అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్టీఆర్ 24 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, చంద్రబాబు నాయుడు 34 శాతానికి పెంచారని, వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇచ్చామని వివరించారు. బీసీ సోదరుల ద్రోహి జగన్ అని అన్నారు. 2019లో వైసీపీ అధికారం లోకి వచ్చాక అనేకమంది బీసీలను అత్యంత అమానవీయంగా చంపేశారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌ను 10 శాతం తగ్గించారని, వారికి చెందిన 8 వేల ఎకరాల అసైన్డ్ భూములు కొట్టేశారని ఆరోపించారు. ఆదరణ పథకం కింద గతంలో లబ్దిదారులు చెల్లించిన 10 శాతం డిపాజిట్ కూడా ఇవ్వలేదన్నారు. 56 కార్పొరేషన్లకు నిధులు, విధులు లేవని, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారు. సీఎం జగన్ బీసీ బ్యాక్ బోన్ అంటూనే వారి వెన్నువిరిచే కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 26 వేల మందిపై తప్పుడు కేసులు పెట్టించారని, అనేకమందిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి జైలుకు పంపించారని లోకేశ్ అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఓడిపోయే సీట్లన్నీ బీసీలకు ఇస్తూ, గెలిచే సీట్లు వారి సామాజికవర్గానికి ఇచ్చుకుంటున్నారని చెప్పారు. మంగళగిరిలో రెండుసార్లు ఆర్కే గెలిచారని, ఇప్పుడు పరిస్థితులన్నీ పూర్తిగా అద్దం తిరిగేసరికి బీసీ పేరుతో మ్యాజిక్ చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. మరి పులివెందుల సీటు బీసీలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఏ అధికారి అయితే చట్టాన్ని ఉల్లంఘించాడో వారిపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేసి, డిస్మిస్ చేస్తామని తాను బహిరంగసభలో చెప్పానని, ఎక్కడా చట్టాన్ని ఉల్లంఘించలేదన్నారు. నేను ఏం మాట్లాడాలో సీఐడీ వాళ్లు నాకు చెబుతారా? ఒక పని చేయ మనండి, సజ్జల రామకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, సీతారామాంజనేయులు స్క్రిప్ట్ పంపించమనండి, అదే చదువుతాను అంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష పార్టీలపై బురద చల్లడం, సినిమాలు తీయడం కొందరికి అలవాటుగా మారిందన్నారు. వ్యూహం సినిమా బడ్జెట్ అంతా సైకో జగన్‌దే అని లోకేశ్ ఆరోపించారు. జనసేన పార్టీతో మాకు అద్భుతమైన సమన్వయం ఉందని తెలిపారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాల్లో మావారితో జనసైనికులు కలిసి తిరుగుతున్నారని, పండుగ తర్వాత మ్యానిఫెస్టో విడుదల చేస్తామని లోకేశ్ చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమృతధారణి 'శతక పద్యం'

తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ విజయలక్ష్మీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: కవుల అనుభవ సారాన్ని అందించిన అమృతధారణి 'శతక పద్యాలు' అని గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి అన్నారు. గుంటూరు విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవం సందర్భంగా స్థానిక లాడ్జి సెంటర్ ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభ్యుదయ సాహిత్యోద్యమ నేత డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య ప్రాంగణం, నయాగరా కవి, నాటక రచయిత, అనువాదకులు బెల్లంకొండ రామదాసు శత జయంతి సాహిత్య వేదిక నందు శుక్రవారం సాయంత్రం 'శతక పద్య పఠనం'పై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ లోక రీతిని... జీవన నైపుణ్యాలను అందించడంలో ఆనాటి నుంచి ఈనాటి వరకు శతక పద్యాలదే ప్రధాన పాత్ర అని అన్నారు. నేటి యువతలో మానవీయ విలువలు లోపించకుండా ఉండాలంటే తప్పకుండా శతక పద్యాలను బాల్యం నుంచి కంఠస్తం చేయాలని సూచించారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అని ధైర్య వచనాలు బోధించాలన్న... అపకారికి ఉపకారం నెపమెన్న కుండా చేయమని హితవు బోధించాలన్న... 'చేతు లకు తొడవుదానము' అని దానగుణ అవసరాన్ని తెలియజెప్పాలన్న అది శతక పద్యాలకే సాధ్యమన్నారు. ఎటువంటి ఊర్లో నివసించాలి... ఎలా మాట్లాడాలి... ఎదుటి వారు చెప్పిన విషయాన్ని ఎంతవరకు పాటించాలి... నిజమైన స్నేహితులు ఎలా ఉండాలి... ఇలాంటి విషయాలను శతక పద్యాలు చాలా సరళంగా మనస్సుకు హత్తుకునేలా బోధిస్తాయని ఆమె తెలిపారు. ఇవే నిజానికి నిత్యజీవితంలో అవసరమైన నైపుణ్యాలు అని, తెలుగు భాషకు ప్రాధాన్యత తగ్గిపోతున్నందున మనం తప్పనిసరిగా ఆంగ్ల మాధ్యమంలో చదివిస్తున్నా కూడా వీలైతే పాఠశాలలో... ఇంట్లోనైనా బాలలకు శతక పద్యాలు నేర్పించాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం చాలా చక్కగా నిర్వహిస్తున్నందుకు, పోటీలు నిర్వహించి బాలలను ప్రోత్సహిస్తున్నందుకు అభ్యుదయ రచయితల సంఘం వారిని అభినందిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు హిందూ కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ యల్లాప్రగడ మల్లిఖార్జునరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ శతక పద్యాలు జ్ఞాపక శక్తిని పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ, జిల్లా కార్యదర్శి బుల్లా రవిబాబు, గుంటూరు విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు : విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవాలు సందర్భంగా అరసం జిల్లా కార్యదర్శి బుల్లా రవి అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవ సభ శనివారం సాయంత్రం జరగనుంది. ఈ కార్యక్రమానికి కన్న ఇంగ్లీష్ మీడియం అధినేత కన్న మాష్టారు ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తారు.

'ఉల్ఫా'తో శాంతి ఒప్పందం

న్యూదిల్లీ: అసోంలో సాయుధ వేర్పాటువాద ఉద్యమానికి తెరదించి, పూర్తిస్థాయిలో శాంతి స్థాపించే దిశగా కీలక అడుగు పడింది. ఈ మేరకు యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం-ఉల్ఫాలోని చర్చల అనుకూల వర్గానికి కేంద్ర ప్రభుత్వానికి, అసోం రాష్ట్ర ప్రభుత్వం మధ్య శుక్రవారం త్రైపాక్షిక శాంతి ఒప్పందం కుదిరింది. ఉల్ఫాకు చెందిన 16 మంది సభ్యులు, పౌరసమాజంలోని 13 మంది సభ్యులు కలిసి మొత్తం 29 మంది కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సమక్షంలో దిల్లీలో ఈ ఒడంబడికపై సంతకాలు చేశారు. దీని ప్రకారం హింసను వీడి, జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఉల్ఫా అంగీకరించింది. "ఉల్ఫా హింస కారణంగా అసోం చాలా నష్టపోయింది. 1979 నుంచి ఇప్పటివరకు 10వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వంతో ఉల్ఫా శాంతి ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామం. హింసను వీడి, వేర్పాటువాద సంస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసేందుకు ఉల్ఫా అంగీకరించింది. ఉల్ఫాతో ఒప్పందం ప్రకారం అసోంకు భారీ అభివృద్ధి ప్యాకేజీ ఇస్తాము. ఈ ఒప్పందాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తాము" అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 'సార్వభౌమ అసోం' డిమాండ్‌తో 1979 ఏప్రిల్‌లో ఉల్ఫా ఏర్పాటైంది.

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఇంట్లో ఏసీబీ సోదాలు

విశాలాంధ్ర-విజయవాడ : ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నివాసంపై ఏసీబీ అధికారులు దాడులు చేపట్టారు. అవినీతి అధికారులపై వచ్చిన ఫిర్యాదులతో ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన ఈ అధికారి ఇంటిపై విజయవాడలోని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) అధికారులు సోదాలు జరిపారు. ఈ నెల 26న చిత్తూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాటకొండ వెంకట మధుసూదన్‌పై ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న నేరంపై కేసు నమోదయింది. 28న ఈ అధికారి నివాసంతో పాటు ఇతర ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు. తిరుపతి, మదనపల్లి, పలమనేరు, చిత్తూరు, కర్నాటక రాష్ట్రంలోని బెంగళూరులో కూడా సోదాలు జరిపారు. ఈ సందర్భంగా ఈ అధికారి నివాసంలో భారీఎత్తున చర, స్థిర ఆస్తులు కనుగొన్నారు. ఈ అధికారి పేరు మీద తిరుపతి రూరల్ మండలంలో ఒక ఫ్లాట్, ఆయన భార్య పేరు మీద తిరుపతిలో ఆస్బెస్టాస్ షెడ్ హౌస్, మదనపల్లిలో జీ+1 ఆర్‌సీసీ భవనం, పులవాండ్లపల్లిలో ఒక గెస్ట్ హౌస్ జీ+ పెంట్ హౌస్ (266 చ.అ.), పలమనేరులో 23.00 ఎకరాల వ్యవసాయ భూమి, అలాగే, భార్య, అతని తండ్రి పేరు మీద 15 ఓపెన్ ప్లాట్లను మదనపల్లి, తిరుపతి, చిత్తూరు జిల్లా పలమనేరు, బెంగళూరులో కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అలాగే, సుమారు రూ. 30 లక్షల విలువ చేసే హుందాయ్ క్రెటా, మారుతీ స్విఫ్ట్, ఇన్నోవా కార్లు, సుమారు రూ.1.25 లక్షల విలువ చేసే సుజుకి ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్ ఉన్నాయి. ఇక రూ.5,10,000 నగదు, సుమారు రూ.81 లక్షల విలువైన 2055.000 గ్రాముల బంగారం, సుమారు రూ.2.4 లక్షల విలువ చేసే వెండి వస్తువులు, రూ.26,00,000 విలువైన గృహోపకరణాలు, బ్యాంక్ బ్యాలెన్స్ రూ.10,00,000 ఉన్నట్లు కనుగొన్నారు. దర్యాప్తు అనంతరం అధికారిని నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. ఇంకా సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్వానము

34వ పుస్తక మహోత్సవం సందర్భంగా

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

పుస్తకాల ఆవిష్కరణ

వేదిక : గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి గ్రౌండ్, రమేష్ హాస్పటల్స్ ఎదురుగా, విజయవాడ

30-12-2023 సాయంత్రం 6.30 గంటలకు

జనాభా సంఖ్య - అపోహలు - భారత రాజకీయాలు — రచయిత : శ్రీ ఎస్.వై. ఖురేషి

ముఖ్య అతిథి : శ్రీ ఎస్.వై. ఖురేషి, IAS (Rtd.) భారతదేశ మాజీ ప్రధాన ఎన్నికల అధికారి

గౌరవ అతిథులు : శ్రీ A. Md. ఇంతియాజ్, IAS ప్రిన్సిపల్ సెక్రటరీ, మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

శ్రీ రంజిత్ బాషా, IAS కలెక్టర్ & డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, బాపట్ల జిల్లా

డా॥ కె. నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి

శ్రీ కె. రామకృష్ణ, Ex. MLA ఛైర్మన్, ఎడిటోరియల్ బోర్డ్, విశాలాంధ్ర దినపత్రిక

శ్రీ ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఛైర్మన్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి గవర్నింగ్ బాడీ

శ్రీ జల్లి విల్సన్, Ex. MLC, కార్యదర్శి, విశాలాంధ్ర విజ్ఞాన సమితి

అధ్యక్షులు : శ్రీ గద్దం కోటేశ్వరరావు అసోసియేట్ ప్రొఫెసర్ (Rtd.), సంపాదకుడు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

పుస్తక ఆవిష్కరణ సభలో తమరు తప్పక పాల్గొనాలని మనవి

అభివందనాలతో
టి. మనోహర్ నాయుడు
మేనేజర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.